ప్రజాశక్తి
కర్నూలు
సోమవారం
జనవరి
1 - 2018
12 పేజీలు



మోడీ విధానాలతో పేదలకు కష్టాలు

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి
నగర మహాసభలో సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు



కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాలు పేదలకు కష్టాలు, ధనికులకు లాభాలు తెచ్చి పెడుతున్నాయని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు విమర్శించారు. వామపక్ష ప్రజాతంత్రవాదులను కలుపుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కెకె భవన్‌లోని సుబ్బయ్య ప్రాంగణం లో సిపిఎం నగర 18వ మహాసభ, కల్లూరు 5వ జోన్ సభలు జరిగాయి.

(వార్త 4లో...)

అగ్రవర్ణాల శవం ఖననం చేసే గుంత తవ్వలేదని..

దళితుల గ్రామ బహిష్కరణ


గ్రామ బహిష్కరణకు గురైన దళితులు

అగ్రవర్ణాల శవాన్ని ఖననం చేయడానికి గుంత తవ్వలేదని రుద్రవరం మండలం నక్కలదిన్నెలో దళితులను పెత్తందారులు ఆదివారం గ్రామ బహిష్కరణ చేశారు. ఎస్‌సి కాలనీకి నిత్యావసర సరుకులు, తాగునీరు, విద్యుత్ సరఫరాను నిలిపేశారు.

(వార్త మెయిన్ పేజీలో...)



కెసికి 10.212 టిఎంసిలు



కెసి కెనాల్‌కు ఫిబ్రవరి దాకా నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇరిగేషన్ ఎస్ఇ శివరామ చంద్రమూర్తి కెసి కెనాల్ నీటి అవసరాలపై ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం కెసి కెనాల్‌కు 10.212 టిఎంసిల నీటిని ఫిబ్రవరి చివరి దాకా విడుదల చేయాలని నిర్ణయించింది.

(వార్త 4లో...)







'జన్మభూమి'
సమస్యల పరిష్కార
వేదిక
వార్త 4లో..

కోటి ఆశలతో
కొత్త
సంవత్సరంలోకి..
వార్త 6లో..

స్వచ్ఛతకు
మేము సైతం
వార్త 12లో..





కుష్టు వ్యాధిగ్రస్తులకు బియ్యం, దుప్పట్లు పంపిణీ

కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని లెప్రసీ కాలనీకి చెందిన 50 మంది పేద, కుష్టు వ్యాధిగ్రస్తులకు సాయి ఎడ్యుకేషనల్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ(సెరూడ్స్) స్వచ్ఛంద సేవా సంస్థ, సేవ్ ది చైల్డ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బిస్కెట్లు, బియ్యం, దుప్పట్లు సెరూడ్స్ అధ్యక్షులు మల్లికార్జున ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని నిరుపేదలకు ఏదో ఒక మంచి పని చేయుటకు తమ సంస్థ ముందుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సమాజానికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, జ్ఞానేశ్వర్, అఖిల్ పాల్గొన్నారు.

2న సిపిఐ మహాసభలు

వెల్దుర్తి రూరల్ : వెల్దుర్తి పట్టణంలో ఈ నెల 2న జరుగబోయే సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి మాధవస్వామి కోరారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ముర్లీనాయుడు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణ విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుం దని తెలిపారు. ముఖ్యంగా రైతులకు రుణమాఫి సక్రమంగా చేయలేదని విమర్శించారు. ప్రజా సంఘాల నాయకులు, ఆటో కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఎఐటియుసి నాయకులు యేసయ్య, నాగమద్దయ్య, వ్యకాస నాయకులు హరి, చంద్రశేఖర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పార్కులను పరిశీలించిన కమిషనర్

కర్నూలు కార్పొరేషన్ : అమృత్ పథకం కింద నగరంలోని పార్కులను అభివృద్ధి పరుస్తామని కమిషనర్ సిబి హరినాథరెడ్డి అన్నారు. ఆదివారం ఎపియు, జిబిసిఎండి చంద్రమోహన్‌రెడ్డి కమిషనర్‌తో కలిసి పార్కులను పరిశీలించారు. 2016-17 సంత్సరానికి అమృత్ కింద అభివృద్ధి పరుస్తున్న వాణిజ్యనగర్ రాజీవ్ గాంధీ పార్కులను వారు పరిశీలించారు. 2017-2020 వరకు అమృత్ కింద ప్రతిపాదించిన నాగిరెడ్డి కాలనీ, వీనస్ కాలనీలను చూశారు. అనంతరం నగరంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మీడియాన్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఇ రమణమూర్తి, హెచ్‌ఒలు నాగరాజు, సుజాత కుమారి, టెక్నికల్ అధికారి గోపినాథ్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

కర్నూలు కార్పొరేషన్ : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైన్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయని ఆ సంస్థ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కల్లూరు చందుజట్టు ట్రోఫిని కైవసం చేసుకుందని తెలిపారు. రన్నరప్‌గా నైన్‌టీమ్ జట్టు నిలిచిందని చెప్పారు. అత్యధిక పరుగులు సుమంత్ సాధించగా, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా యస్వంత్ నిలిచారని పేర్కొన్నారు. గెలుపొందిన విజేతలకు నేడు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

కొత్తూరులో ప్రముఖుల పూజలు

పాణ్యం : మండలంలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి దేవసేన సుబ్రమణేశ్వరస్వామికి ఆదివారం ప్రముఖులు పూజలు నిర్వహించారు. 2017 సంవత్సరం చివరి రోజైన ఆదివారం వైసిపి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా జడ్జి రాజేంద్రప్రసాద్ కుటుంబ సమేతంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు. తెలంగాణ, కర్ణాటక, ఎపి రాష్ట్రాల నుంచి చాలామంది భక్తులు స్వామి వారిని దర్శించు కున్నారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డికి ఆలయ అధికారి రామకృష్ణ, ఆలయ అర్చకులు నారాయణశర్మ, సురేష్‌శర్మ ఆలయ మర్యాదలతో స్వామివారి తీర్థ ప్రసాదాలు, అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

విద్యార్థిని అదృశ్యం

కర్నూలు క్రైం : ఇంటర్ చదువుతున్న విద్యార్థిని కనిపించడం లేదని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.గార్గేయపురం గ్రామానికి చెందిన రాజశేఖర్‌బాబు కుమార్తె అరుణకుమారి (16) ఈ నెల 27న ఇంట్లో నుంచి వెళ్లి ఇంతవరకు రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికి తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాచీ పేరుకుపోయిందోచ్..

కొట్టాల కాలనీలో నీటి పథకం దుస్థితి

ప్రజాశక్తి సి.బెళగల్

సి.బెళగల్ మండలంలో ఊరికి చివరగా కొట్టాల కాలనీ ఉంది. నిత్యం వాహనాల రద్దీ, అధికారులు, నాయకులు ఈ కాలనీలో తరచూ సంచరిస్తారు. అయినా ఈ తాగునీటి పథకాన్ని చూడకపోవడం నిండా నిర్లక్ష్యనికి దర్శనమిస్తున్నది. ఈ కాలనీలో 150 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బైపాస్ రోడ్డుపైనే తాగునీటి పథకం ఏర్పాటు చేశారే తప్ప పరిసర ప్రాంతాలు పరిశుభ్రతను మరిచిపోయారు. సురక్షితమైన నీటిని అందించేందుకు ఈ పథకం నోచుకోలేదెమో అందుకే పాచీ పెరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ప్రజలు ఆ నీటినే తాగి కాలం వెల్లబుచుతున్నారు. ఈ సమస్యపై మండలస్థాయి అధికారి 9704234573 ఫోన్ చేసి అడగవచ్చన రీతిలో ఉందని చెప్పుకోవచ్చును.



పాచి పట్టిన నీటి పథకం

ఉచిత శిక్షణ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ద్వారా కర్నూలు శాసన సభ్యులు అందిస్తున్న ఉచిత శిక్షణ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన టెట్, డిఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి కాల్వ శ్రీనివాసులు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సెంటర్‌లో 500 మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారని, కర్నూలు, హైదరాబాదుల నుండి ప్రతిభ గల అధ్యాపకుల చేత శిక్షణ ఇప్పిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి శాంతి ఆశ్రమం ట్రస్టు ద్వారా మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ వైవి శివయ్య, అరుణాచలం రెడ్డి, షంషద్దీన్, టిడిపి నాయకులు రవికుమార్, నగర అధ్యక్షులు షరీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాల్వ శ్రీనివాసులు

2 నుంచి జన్మభూమి - మా ఊరు

ప్రజాశక్తి - పాణ్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని పాణ్యం మండలంలోని అధికారులంతా క్షేత్రస్థాయిలో పనిచేసి విజయవంతంగా చేయాలని మండల ప్రత్యేక అధికారి ఫిరోజ్‌ఖాన్ కోరారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు ఎంపిడిఒ చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ విడతగా జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిథులు కలిసికట్టుగా పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 2 నుంచి 11 తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో ప్రగతి నివేదికలు గ్రామస్థాయి అధికారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు తప్పకహాజరు కావాలన్నారు. ఇఒఆర్‌డి రమణ, ఎంపిటిసి రంగరమేష్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రావు, ఎంఇఒ కోటయ్య, అధికారులు, ప్రజాప్రతినిథులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

బివై రామయ్యకు సోమిశెట్టి, నాగేశ్వరరావుయాదవ్ హితవు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

స్థాయిలను గుర్తించి ఇకనైనా వ్యక్తిగత విమర్శలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలుంటా యని, వ్యక్తిగత విమర్శలు కాకుండా అభివృద్ధిపై మాట్లాడితే బాటుంటుందని వైసిపి కర్నూలు పార్లమెం టు అధ్యక్షులు బివై రామయ్యకు టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్ హితవు పలికారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయ ంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తిపై బివై రామయ్య చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. సుధీర్ఘ రాజకీయ అనుభవమున్న ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తిని విమర్శించేందుకు బివై రామయ్యకున్న అర్హత ఏముందని ప్రశ్నించారు. ఇకనుంచైనా నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందన్నారు. వ్యక్తిగత విమర్శలు మాని రాజకీయ పరమైన, అభివృద్ధి పరమైన విమర్శలు చేస్తే సబబుగా ఉంటుందని పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ మా భిక్ష అంటున్నారని, ఆ వ్యాఖ్యలను తీవ్రగా ఖండిస్తున్నామన్నారు. అసలు ఎమ్మెల్సీ సీటు టిడిపి తరపుననే రెండు సార్లు గెలుచుకున్నామని, అది భిక్ష ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇకనుంచైనా చౌకబారు విమర్శలు మానకుంటే తీవ్ర పరిణామాలుంటాయని వారు హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు తుగ్గలి నాగేంద్ర, మహేష్‌గౌడ్, రవికుమార్ ఉన్నారు.

ఫ్యామిలీ కౌనెల్సింగ్‌లో 15 జంటలు రాజీ

కర్నూలు క్రైం : చిన్నపాటి సమస్యలకే పంతం పెట్టుకుని మధ్యలో మరోవ్యక్తి వచ్చి సర్ధిచెప్పేంత అవకాశం ఇవ్వకూడదని, ఇద్దరూ కలిసి చర్చించుకుని సర్దుకుపోతేనే సంసారమని మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఎం వెంకటాద్రి అన్నారు. గత వారం రోజులుగా మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న 23 జంటలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌తో 15 జంటల మధ్య రాజీ కుదిరిందని చెప్పారు. అందులో 15 జంటల మధ్య రాజీ కుదిరి కుటుంబ జీవితానికి సుముఖత చూపాయి. 5 జంటల మధ్య రాజీ కుదరకపోవడంతో మరో కౌన్సెలింగ్‌కు రావాలని సూచించారు. మిగిలిన 3 జంటలు తమ సమస్యను కోర్టులో పరిష్కరించుకుంటామని తెలిపాయన్నారు. ఈ కౌన్సెలింగ్‌లో డాక్టర్ పాపయ్యగుప్త, అడ్వకేట్ ఇందుమతి, మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌ఐలు జి చంద్ర, చిన్న పీరయ్య, మహమ్మద్ అలి, మహిళా పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

7న 5కె రన్

కర్నూలుకలెక్టరేట్ : 5కె రన్ కార్యక్రమాన్ని ఈ నెల 7తేదీన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 5కె రన్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా 5కె రన్ నిర్వహణకు సంబంధించిన టీషర్ట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 5కె రన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయాలన్నారు. క్రీడాకారులు, విద్యార్థులు, ప్రజలందరిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఒ ఆనంద్ నాయక్, డిఎస్‌డిఒ పాల్గొన్నారు.

కెఎన్‌ఆర్‌లో నూతన సంవత్సర వేడుకలు

కర్నూలు కలెక్టరేట్ : వెంకట రమణ కాలనీలోని సివిరామన్ విద్యా సంస్థలకు చెందిన కెఎన్‌ఆర్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఎ అశ్వక్ ఆధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సివి.రామన్ కళాశాల కరస్పాండెంట్ టి రాఘవేంద్ర, కెఎన్‌అర్ స్కూల్ యాజమాన్యం టి గోపినాథ్, టి శ్రీదేవి పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేశారు.కెవెంకటేశ్వర్లు, షరీఫా, కెఅప్రోజ్, సివెంకటేశ్వర్లు, సరిత, శారద, కల్పన, రఫిక్, మల్లీశ్వరీ పాల్గొన్నారు.

కెఇ.ప్రభాకర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కర్నూలు కార్పొరేషన్ : నూతన సంవత్సరం, ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కెఇ.ప్రభాకర్ నివాసంలో కమ్మ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డా.క్రిష్ణమోహన్, పెనికలపాటి రాజశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసులు శుభాకాంక్షలు తెలిపారు. శేఖర్, నాగిరెడ్డి, బాబ్జీ, గోపి, చందు పాల్గొన్నారు.

మౌజన్ ఫరూక్ సాహెబ్ హత్యకు నిరసనగా 2న ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాజమండ్రిలోని మౌజన్ ఫరూక్ సాహెబ్ హత్యకు నిరసనగా ఈ నెల 2వ తేదీన ఉమర్ అరబిక్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు కర్నూలు పౌరసమాజం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు జామాతే ఉలేమా హింద్ జిల్లా అధ్యక్షులు ఖాజిఅబ్దుల్ మజీద్‌సాబ్ చెప్పారు. ఆదివారం ఉర్దూఘర్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో షాషామసీదు మౌలానా అబ్దుల్ సలామ్ అధ్యక్షత వహించారు. వైసిపి కర్నూలు జిల్లా ఇన్‌ఛార్జి హఫిజ్‌ఖాన్, ఎస్‌డిపిఐ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లాఖాన్, కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ ఛైర్మన్ మహ్మద్ అలిఖాన్, పాడ్స్ జాతీయ కార్యదర్శి శ్రీనివాసరావు, జమాతే ఇస్లామియా నాయకులు అమీర్, రిటైర్డు తహశీల్దార్లు రోసన్‌అలి, అజయ్‌కుమార్, సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్య వేదిక జయన్న, బిసి జనసంఘ్ రాష్ట్ర నాయకులు శేషఫణియాదవ్, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా కర్నూలు బాధ్యులు జహాంగీర్‌పాషా, ఆర్‌టిసి కార్మిక సంఘం రాష్ట్రమాజి కార్యదర్శి ఎన్‌ఎ ఖాన్, ఉలేమాలు అనేక ప్రజాసంఘాల కర్నూలు పౌరసమాజం ఆధ్వర్యంలోపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌజన్‌ఫరూక్ సాహెబ్ కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, హంతకులను గుర్తించి అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత క్రిస్టియన్, బిసి, ముస్లిం వ్యతిరేక విధానాలు పెంచిపోషించాడాన్ని ఖండించారు. అక్లాక్ కుటుంబ హత్య, ఉవాఘటనలు, అమలాపురం ఘటనలు, కేరళ మత దురహంకార ప్రదర్శనలు, విజయవాడ పుష్కరాల సందర్భంగా నగర విస్తరణ పేరుతో కూల్చిన అనేక ముస్లిం, క్రైస్తవ, హిందూ ఆలయాలే దీనికి పరాకాష్ట అన్నారు. లౌకిక ప్రజాతంత్ర వాదులు వీటిని ప్రతి ఘటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలకు బాధ్యులను వెంటనే శిక్షించి, అప్పుడైన ఫరూక్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి నినాదాలు, ప్లకార్డులు, ప్రదర్శిస్తూ ఎలాంటి ఘర్షణలకు ఉద్రిక్తలకు తావివ్వరాదని సమావేశంలో అనవసర ప్రసంగాలు లేకుండా ఐక్యతను ప్రదర్శిస్తూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల లౌకిక వ్యతిరేక విధానాలు మానేటట్లు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి సంజామల

మండల ప్రజలకు, అధికారులకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, పేరుసోముల, రామిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలకు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మంచాల మద్దిలేటిరెడ్డి, పెండేకంటి కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. 2018లో ప్రజలు సంతోషంగా జీవించాలని ఆయన కోరారు. సంజామల మండల ప్రజలకు, అధికారులకు, వైసిపి నాయకులకు, కార్యకర్తలకు 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాష్‌రెడ్డి తెలిపారు.

కాపు, బలిజ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కాపు, బలిజ సంఘాల క్యాలెండర్‌ను కోవెలకుంట్ల మండల బలిజ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు లాయర్ బాల మురళీకృష్ణ, ఎస్.ఆంజనేయులు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఈశ్వరయ్య, సెక్రటరీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ మోహన్, సుబ్బరాయుడు, సలహ దారులు సుబ్రమణ్యం, పరందామయ్య, తిరుపాలయ్య, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్ల వెంకటరాముడు అనే వ్యక్తికి సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ చేసినట్లు టిడిపి జిల్లా కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్ల వెంకటరాముడుకు అనారోగ్యంగా ఉన్నారన్నారు. చికిత్సకు అయిన ఖర్చులన్ని సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందుకు రూ.76 వేలు మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రామచంద్రారెడ్డి, శివరామిరెడ్డి, పిసి.రమణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పంది దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలో పంట పొలాలను నాశనం చేస్తున్న పంది దాడి చేసి అంటె నరేంద్ర అనే వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలో ఉన్న ఉన్న పంట పొలాన్ని పరిశీలించేందుకు నరేంద్ర వెళ్లారు. గ్రామాల్లో నివసించే పంది పంట పొలాల్లోకి వెళ్లింది. ఆకస్మాత్తుగా ఆ పంది నరేంద్రపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. గతంలో గ్రామ పందులు పంట పొలాలను నాశనం చేస్తున్నాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా పందులు గ్రామంలో నివసిస్తునే ఉన్నాయనాయి. పందులను గ్రామం నుంచి తరలించాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరికి కంటి చూపు ఇచ్చిన సురేంద్రనాథ్‌రెడ్డి



నేత్రాలను దానం చేస్తున్న ఎస్ఐ రాకేష్, మృతుని తండ్రి

ప్రజాశక్తి - బనగానపల్లె అర్బన్

మండలంలోని యాగంటిపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి సురేంద్రనాథ్‌రెడ్డి(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తన నేత్రాలను మట్టిలో కలిసి పోకుండా ఇద్దరికి చూపు కల్పించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు నేత్రాలను దానం చేశారు. ఆదివారం ఎస్ఐ రాకేష్, మృతుని తల్లిదండ్రులు పుల్లారెడ్డి, పుణ్యవతి కుమారుని నేత్రాలను ఐ బ్యాంక్ వారికి దానం చేశారు. ఎస్ఐ రాకేష్ నేత్రదానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి నేత్రాలను దానం చేసే విధంగా వప్పించి నేత్రాలను దానం చేశారు.

జన్మభూమిలో పంచాయతీ ప్రత్యేక అధికారులే కీలకం

- 2 నుంచి గ్రామాల్లో పర్యటన, పనుల పరిశీలన

- అధికారులు గైర్హాజరైతే చర్యలు

ప్రజాశక్తి సి.బెళగల్

ఈ నెల 2 నుంచి 11 తేదీ వరకు జరిగే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల్లో పంచాయతీ ప్రత్యేక అధికారులు కీలకంగా వ్యవహరించాలని ఎంపిడిఒ సిద్దలింగమూర్తి ఆదివారం తెలిపారు. 2న సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిశీలించి, కొరవడిన మౌలిక వసతుల కల్పనకు తగు దృష్టి సారించేందుకు చర్యలు చేపట్టాలి. 3న గ్రామాల్లోని వైద్యసేవలు, మండలంలో వైద్య సిబ్బంది అందిస్తున్న పని తీరును పరిశీలించాలి. 4న స్వచ్ఛంద్ర ప్రక్రియపై తగు నివేదికలు తయారు చేయాలి. 5న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించుటకై విద్యాప్రమాణాలు మెరుగుపరుచుటలో ఉపాధ్యాయుల పాత్ర తెలుసుకోవాలి. 6న పంచాయతీ, మజారా గ్రామాలాభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికలు చేపట్టాలి. 7న ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులు ఏ మేరకు ఖర్చు చేశారో నివేదికలు తయారు చేయాలి. 8న రైతులకు ఏమేమి పథకాలు అవసరమో వాటి నివేదికలు, పాడి పరిశ్రమల్లో భాగంగా పాడి పోషకులకు అవగాహన కల్పించాలి. 9న ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన పనితీరు దరిచేరిన సంక్షేమ పథకాల పనితీరు, ఏవైన సమస్యలుంటే తెలుసుకోవాలి. 10 సమీక్ష సమావేశాల్లో శాఖాధికారులతో చర్చలు జరపాలి. 11న అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసే నిధుల జాబితాను ప్రవేశ పెట్టడం మరి విడుదలయైన ఎన్టీఆర్ గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల ధ్రువపత్రాలు పంపిణీ చేయాలి. ఈ కార్యక్రమాలపై గ్రామాల్లో ఒక రోజు ముందుగా దండోరా వేయించాలి. పకడ్బందీగా నిర్వహించుట ప్రత్యేక అధికారుల బాధ్యత వహించాలి. అధికారులు గైర్హాజరైన యెడల చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరించారు.

విద్యుత్ ఎడికి ఘన సన్మానం



సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి సి.బెళగల్

సి.బెళగల్, కోడుమూరు, గూడూరు పరిధిలో గల విద్యుత్ ఎడి విజయసారథికి పొలకల్లు సబ్ స్టేషన్‌లో మండల విద్యుత్ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. ఉత్తమ ఇంధన పొదుపు అవార్డు గ్రహీతగా ఇటీవల ఎంపికైయ్యారు. పొలకల్లు లైన్‌మెన్ చిరంజీవి ఆదివారం సన్మాన సభను నిర్వహించారు. ఉత్తమ ఇంధన పొదుపు అనేది ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అవార్డు గ్రహీత సభలో తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌నాయక్, లైన్‌మెన్లు రామకృష్ణరాజు, రాముడు, రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ఫాతేహాలు



దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని వివిధ దర్గాల్లో ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో ఉన్న మాబు సుభాని దర్గా, గ్రామ పంచాయతీ సమీపంలోని మహమ్మద్ భాష ఖాద్రీ దర్గాలను సందర్శించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అత్తార్ సాజిద్ హుస్సేన్, ముస్లిం మైనార్టీ నాయకులు బురానుద్దీన్, అల్తాఫ్ హుస్సేన్, టిప్‌టాప్ కలాం, రాయలసీమ సలాం, ఆసీఫ్, సయ్యద్, అబ్బాస్, టిడిపి నాయకులు కొప్పెల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - ప్యాపిలి

రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత మన అందరిపై ఉందని జలదుర్గం ఎస్ఐ సురేష్ అన్నారు. ఆదివారం జలదుర్గం గ్రామంలో ప్రధాన కూడలీల్లో పలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బ్యానర్లల్లో మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పక ధరించాలని, వాహనదారులు సీట్ బెల్టు ధరించాలని, అధిక లోడుతో వెళ్లరాదని ఉందని తెలిపారు.



మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థి మృతికి ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి

ప్రజాశక్తి - బనగానపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థి సురేంద్రనాథ్ రెడ్డి మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆదివారం వైద్యశాలలోని మార్చురీ గదిలో ఉన్న విద్యార్థి సురేంద్రనాథ్‌రెడ్డి మృత దేహాన్ని టిడిపి నాయకులు తపాలా పెద్ద దస్తగిరి, యామ చిన్నపుల్లారెడ్డి, బొబ్బల రామగోపాల్‌రెడ్డి సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందడం బాధకర మన్నారు. చేతికొచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తల్లిదండ్రులకు విషాదాన్ని నింపింది.

రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

మండలంలోని భీమునిపాడు, కంపమల్ల రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త షేక్ సత్తార్(29) మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షేక్ సత్తార్ శనివారం సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన షేక్ సత్తార్ తన భార్య మహబూబ్ బీ గ్రామమైన అలమూరుకు బయల్దేరారు. కోవెలకుంట్ల మీదుగా భీమునిపాడు, కంపమల్ల మధ్య వరికోత మిషన్‌ను మినిలారీ వచ్చి ఢీకొనడంతో షేక్ సత్తార్ అక్కడికి అక్కడే మృతిచెందారు. ఈయనకు భార్య, పాప, బాబు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ నాగరాజు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎపిటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్ల పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో ఎపిటిఎఫ్ 2018 డైరీ, క్యాలెండరును జిల్లా కార్యదర్శి ఖాజాహుస్సేన్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు కెవి.శివయ్య ఆవిష్కరించారు. అనంతరం సంజామల, దొర్నిపాడు, అవుకు మండలాల ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు నూతనంగా ఎన్నికైన ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవి శివయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దయ్యే వరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య, మధన్, కళ్యాణ్‌కుమార్ రాజు, సునీల్ కుమార్, అమీద్, సతీష్, వెంకట రామిరెడ్డి, మధు, సురేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ప్రజాశక్తి - బనగానపల్లె

వడ్డెర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వడ్డెర సంఘం సమావేశం శిల్పి సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిసి మాట్లాడుతూ వడ్డెరలు ఐకమత్యంతో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తమ సమస్యలను శాసనసభలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండారు అంజన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం వడ్డెరలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలకు ఎమ్మెల్సీ పదవి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమావేశంలో నాయకులు గిడ్డయ్య, వెంకట సుబ్బయ్య, మద్దిలేటి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి

మోడీ విధానాలతో పేదలకు కష్టాలు



సిపిఎం జెండావిష్కరణ చేస్తున్న ఇ.పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అనుసరిస్తున్న విధానాలు పేదలకు కష్టాలు, ధనికులకు లాభాలు తెచ్చి పెడుతున్నాయని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు విమర్శించారు. వామపక్ష ప్రజాతంత్రవాదులను కలుపుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కెకె భవన్‌లోని సుబ్బయ్య ప్రాంగణంలో సిపిఎం నగర 18వ మహాసభ, కల్లూరు 5వ జోన్ సభలు జరిగాయి. ఈ సభలకు పాణ్యం డివిజన్ కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా సుందరయ్య కూడలిలో ఉన్న పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు ఇ.పుల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కెకె భవన్‌లో కర్నూలు నగర మహాసభ ప్రారంభమైంది. నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అంజిబాబు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ జి.ఓబులు మహాసభలను ప్రారంభించి మాట్లాడారు. మోడీ అధికారంలోకి వస్తే నల్లధనాన్ని తీసుకొచ్చి ఒక్కొక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తామని చెప్పి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఏ ఒక్కరి జన్‌ధన్ ఖాతాలో జమ కాలేదని చెప్పారు. అసంఘటిత రంగం కార్మికులు మోడీ విధానాల వల్ల పస్తులు ఉండాల్సి వస్తుందని తెలిపారు. జిఎస్‌టితో పేద, మధ్య తరగతి ప్రజలపైనే పెనుభారం పడుతుందని చెప్పారు. 12 లక్షల 50 వేల కోట్ల రూపాయలు వస్తుసేవ పన్ను రూపేణా చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వారికి ఊడిగం చేస్తుందని విమర్శించారు. బిజెపి చతుర్ణవర్ణ సిద్ధాంతాన్ని అమలు చేయకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సెంటిమెంటును అడ్డంపెట్టుకొని గొడ్డుమాంసం తిన్నారని, లవ్‌జిహాద్ పేరుతో మనుషులను చంపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛను కూడా హరించివేస్తున్నారని, భావప్రకటన స్వేచ్ఛను ఖూనీ చేస్తున్నారని అన్నారు. పత్రికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన వారిని చంపేస్తున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని తూచాతప్పకుండా మాట్లాడుతున్నారన్నారు. వారి లక్ష్యాలు ఏ ఒక్కటి నేరవేరకపోగా అవినీతి మరింత పెరిగి నల్లధనం పోగుచేసుకునేలా చేసిందని తెలిపారు. కార్పొరేట్ కంపెనీల సిఇఒల సంపద 48 శాతం పెరిగిందని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపడంలో పోటీ పడుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ విద్యార్థులు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా నోరు మెదపడం లేదన్నారు. పశ్చిమ ప్రాంతంలో పనులు లేక వలసలు వెళుతున్నా ఏ మాత్రం ఉపాధి కల్పించలేకపోతున్నారని తెలిపారు. చేసిన వాగ్ధానాలు ఏవీ అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయన్నారు. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కార్యదర్శి నివేదికను సమర్పించారు. అనంతరం వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు జోన్ల వారిగా చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నారు. అనంతరం 17 మందితో సిపిఎం కర్నూలు అర్బన్ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అర్బన్ కార్యదర్శిగా రాజశేఖర్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్, జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా నాయకులు పి.నిర్మల, నాయకులు రాముడు, సాయిబాబా, రాజశేఖర్, అబ్దుల్లా, షరీఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తీర్మానాలు : కర్నూలు నగరంలో రద్దీ తగ్గించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి. అదనంగా సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్, జొహరాపురం డంప్ యార్డు స్థలంలో ఎన్‌టిఆర్ తరహాలో పార్కు అభివృద్ధి చేపట్టాలి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఇందిరమ్మ, బీడీ కార్మికుల ఇళ్లకు మౌళిక వసతులు కల్పించాలి. కర్నూలు సర్వజన వైద్యశాలను రూ.200 కోట్లతో నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలి. రాయలసీమ, ఉర్దూ యూనివర్శిటీలకు ప్రతి సంవత్సరం రూ.50 కోట్లు కేటాయించి అభివృద్ధితోపాటు కొత్త కోర్సులను ప్రవేశపెట్టి యూనివర్శిటీలోని అన్ని పోస్టులను భర్తీచేయాలి. గడియారం ఆసుపత్రిలో వైద్యులను నియమించి రూ.200 కోట్లతో అభివృద్ధి చేసి వైద్య సేవలు అందించాలి. ఆర్‌ఎస్ రోడ్డు వద్ద ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి. వరద రక్షణ గోడలు నిర్మించాలని తదితర సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపట్టాలని తీర్మానాలు చేశారు.

కర్నూలు అర్బన్ కమిటీ కార్యదర్శిగా ఎం.రాజశేఖర్



కర్నూలు అర్బన్ కమిటీ కార్యదర్శిగా ఎం.రాజశేఖర్ ఎన్నికయ్యారు. కర్నూలు అర్బన్ కమిటీకి మొత్తం 17 మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యదర్శి రాజశేఖర్‌తోపాటు రాజగోపాల్, ఎండి షరీఫ్, అబ్దుల్లా, ఇక్బాల్ హుస్సేన్, రషీదా, విజయ్, రామకృష్ణ, ఖాజాబాష, రియాజ్, కృష్ణ, నాగస్వామి, పార్వతయ్య, కరీమ్, రవి, జయమ్మ, రంగస్వామిలు ఎన్నికయ్యారు.

కల్లూరు అర్బన్ కమిటీ కార్యదర్శిగా టి.రాముడు



కర్నూలు నగర పరిధిలోని కల్లూరు అర్బన్ కమిటీకి కార్యదర్శిగా టి.రాముడు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఆర్.నరసింహులు, ఎం.గోపాల్, సి హెచ్ సాయిబాబా, సి.నాగరాజు, ఇ.పుల్లారెడ్డి, ఎండి అంజిబాబు, సుధాకరప్ప, వీరన్న, యేసు, ఉస్మాన్, ప్రభాకర్, బాలలక్ష్మి, రఫీక్, ఎన్.మద్దిలేటి, గోవిందు, ఎస్.శ్యామల, కె.అరుణ, జి.ధనలక్ష్మిలు ఎన్నికయ్యారు.

ఎయిడ్స్‌పై జిల్లాలో విస్తృత అవగాహన

గమన ప్రాజెక్టు మేనేజర్ మాధవి

కర్నూలు సిటీ : హెచ్ఐవి, ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని గమన ప్రాజెక్టు మేనేజర్ మాధవి అన్నారు. ఎడిఎంహెచ్ఒ దేవసాగర్, డిపిఎం అలీహైదర్, పిఒటిఎస్‌యు వేంకటేశ్వర్లు సహకారంతో కర్నూలులోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల యాజమాన్యాల సహకారంతో హెచ్ఐవి అవగాహనా సదస్సులు నిర్వహించామని ఆదివారం ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిడ్స్ ముగింపు వారోత్సవాల సందర్భంగా వివిధ కాలేజీల విద్యార్థులను, సెమీ క్రిస్టమస్ పంక్షన్‌లను, ప్రార్థనా మందిరాలను, బాలబాలికల హాస్టళ్లను, వివిధ శిక్షణా కేంద్రాల యజమానుల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించారు. అడిషనల్ ఎస్‌పి సహకారంతో పోలీస్ డిపార్టు మెంటులో, వెంకాయపల్లి అమ్మవారి భక్తులకు, భిక్షగాళ్లకు, ఆర్‌టిసి బస్టాండులో, రైల్వేస్టేషన్లలో ప్రయా ణికులకు, ఆటో, లారీ డ్రైవర్లకు, రాయలసీయ విశ్వ విద్యాలయంలో, నర్సింగు కళాశాల విద్యార్థులకు, హమాలీలకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో సిబ్బందికి అవగాహన కల్పించామని మాధవి తెలిపారు.



మాట్లాడుతున్న మాధవి

కెసికి 10.212 టిఎంసిలు

ఫిబ్రవరి వరకే సాగునీరు

మార్చి దాకా ఇవ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కెసి కెనాల్‌కు ఫిబ్రవరి దాకా నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇరిగేషన్ ఎస్ఇ శివరామచంద్రమూర్తి కెసి కెనాల్ నీటి అవసరాలపై ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం కెసి కెనాల్‌కు 10.212 టిఎంసిల నీటిని ఫిబ్రవరి చివరి దాకా విడుదల చేయాలని నిర్ణయించింది. కెసి కెనాల్ కింద సుంకేసుల నుంచి మల్యాల ఎత్తిపోతల పథకం వరకు, మల్యాల ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు. జనవరిలో 5.262 టిఎంసిలు, ఫిబ్రవరిలో 4.595 టిఎంసిల నీరు ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా పరిధిలో ప్రస్తుతం కెసి కెనాల్ కింద 1,40,170 ఎకరాల పంటలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కెసి కెనాల్‌కి సంబంధించి తుంగభద్ర డ్యాంలో 5.37 టిఎంసి నీటి వాటా ఉంది. ఇందులో కర్నూలు తాగునీటి అవసరాలకు పోను 3 టిఎంసిల నీటిని రోజుకు 1500 క్యూసెక్కుల చొప్పున కెసి కెనాల్ నీటి అవసరాల కోసం తుంగభద్ర నదిలోకి వదులుతారు. ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయర్‌లో 1.1 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. కర్నూలు నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని 1.12 టిఎంసిల నీటిని సుంకేసుల రిజర్వాయర్‌లో నిలకడగా ఉంచుతున్నారు. తుంగభద్ర నుంచి వచ్చే నీటి నుంచి 1000 క్యూసెక్కుల నీటిని కెసి కెనాల్‌లోకి విడుదల చేసేందుకు అధికారులు నిర్ణయించారు. కెసి కెనాల్‌లోకి మొత్తం 2,056 క్యూసెక్కుల ప్రవాహం అవసరం కాగా, సుంకేసుల నుంచి 1000 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి 338 క్యూసెక్కులు, ముచ్చుమర్రి నుంచి మిగిలిన నీటిని కెసిలోకి పంపింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కెసి కింద పత్తి, మిరప లాంటి పంటలకు మార్చి చివరిదాకా నీటి అవసరం ఉంది. కానీ కేవలం ఫిబ్రవరి చివరివరకే నీటిని విడుదల చేస్తుండడం పట్ల రైతాంగం ఆందోళన చెందుతోంది.

మార్చి చివరిదాకా నీటిని విడుదల చేయాలి

టి.రమేష్‌కుమార్, ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

కెసి కెనాల్ కింద రైతులు పత్తి, మిరప పంటలు సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న వేశారు. వీటికి మార్చి దాకా నీటి అవసరం ఉంది. కానీ ఫిబ్రవరి వరకే నీటిని విడుదల చేయాలని నిర్ణయించడం సరైంది కాదు. మార్చి చివరి దాకా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలి.

'జన్మభూమి' సమస్యల పరిష్కార వేదిక

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వశ్రీనివాసులు



మాట్లాడుతున్న మంత్రి కాల్వశ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జన్మభూమి-మాఊరు కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చడమే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాల్వశ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలా తలపించేలా నిర్వహించాలని కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశపు భవనంలో 5వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 2వ తేదీ నుంచి 11 వరకు చేపడుతున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, వార్డులో జన్మభూమి సభలు చేపట్లాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై ప్రతిరోజు ప్రజలతో చర్చ నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి అభిప్రాయం తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని అధికార యంత్రాంగమంతా కార్యక్రమం ముగిసే వరకు క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులందరినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. జన్మభూమిలో కొత్తగా ఏవైనా సమస్యలపై దరఖాస్తులు వస్తే వాటిని స్వీకరించాలన్నారు. క్రీడాపోటీలు, ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇప్పటికే అన్ని గ్రామాలు, వార్డుల వారీగా షెడ్యూల్స్‌ను తయారు చేశామన్నారు. ఎప్పటికప్పుడు రోజువారీగా వచ్చే ఫిర్యాదులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేశ్, ఎమ్మెల్యేలు ఎస్‌వి మోహన్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డిఆర్ఒ శశిదేవి, సిపిఒ ఆనంద్‌నాయక్, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన జిల్లా ఉన్నతాధికారులు

ఈ ఏడాదైనా వంతెన నిర్మించేరా...



అడ్డవాగునీటిలో దాటుతూ పోలాలకు వెలుతున్న రైతులు,కూలీలు

- ప్రతిపాదనలకే పరిమితమైన అడ్డా వాగు
- వాగును దాటలేక గ్రామస్తుల నరకయాతన
- ఆదుకోవాలని మంత్రి అఖిల ప్రియను కోరుతున్న రైతులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-చాగలమర్రి

చాగలమర్రి మండలం పాతగోపాయిపల్లె రహదారిలో ఉన్న అడ్డవాగు పై వంతెన నిర్మాణ పనులు ఈ ఏడాదిలోనైనా చేపడతారా... లేదా... అన్న సందిగ్ధ పరిస్థితుల్లో రైతులు కోట్టు మిట్టాడుతున్నారు. చాగలమర్రిలోని పాతగోపాయిపల్లె పరిసరాల్లో సుమారు 2 వేల ఎకరాలను రైతులు సాగు చేస్తున్నారు. కంది, మినుము, మల్లె, జొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. 200 ఎకరాల్లో మల్లెపూల తోటను సాగు చేశారు. ఈ పంట పొలాలను నమ్ముకోని సుమారు 500 మంది రైతు కూళీలు పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత పదేళ్ల క్రితం టిజిబి లీకేజి నీరు అడ్డ వాగుకు చేరడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. దీనికి తోడు వర్షం కురిస్తే చాలు అడ్డవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో రైతులు, కూళీలు అడ్డవాగు దాటి పొలాలకు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. పంట పొలాలకు వెళ్లలేక పంటలను కాపాడుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు పండించిన పంటలు ఇంటికి తీసుకురావాలన్నా, పంటలకు ఎరువులు తీసుకుకెళ్లాలన్నా తలప్రాణం తోకకు వస్తుంది. అడ్డవాగుపై వంతెన నిర్మించకపోవడంతో దాదాపు పదేళ్ల నుంచి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు కూళీలు పనులు లేక పొట్ట గడవక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అడ్డవాగులో ఇప్పటికి నీరు ప్రవహిస్తూనే ఉంది. ఉధృతి కొద్దిగా తగ్గితే రైతులు, కూలీలు ఎదుల బండ్ల సాయంతో అడ్డవాగును దాటి పొలాలకు వెళ్తు న్నారు. గతంలో పర్యాటకవాఖ మంత్రిభూమా అఖిలప్రియ చాగలమర్రిలో పర్యటించినప్పుడు రైతులు అడ్డవాగు పై వంతెన నిర్మాణం చేపట్టి తమను ఆదుకోవాలని కోరారు. మంత్రి స్పందించి అడ్డవాగుపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ రాజ్ ఎఇ కొండారెడ్డి రూ.20 లక్షలతో అడ్డవాగుపై వంతెన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి ఏడాది అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండటంతో రైతులు, కూళీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాక్షాత్తూ మంత్రి ఆదేశించిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇక తమను ఎవరూ ఆదుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి భూమా అఖిలప్రియ స్పందించి ఉన్నతాదికారులతో చర్చించి వచ్చే ఏడాది అయిన అడ్డవాగుపై వంతెన నిర్మాణము చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు, కూళీలు కోరుతున్నారు.

ఇంతియాజ్ విద్యాభివృద్ధికి చేసిన సేవలు అమోఘం

శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల విద్యారంగ అభివృద్ధికి 35 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహమ్మద్ చేసిన సేవలు అమోఘమని ఎపి శాసనమండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్, ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఇంతియాజ్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1982లో నంద్యాలలో మొట్టమొదటగా ప్రయివేట్ జూనియర్ కళాశాలను స్థాపించిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. విరమణ అనంతరం ఇంతియాజ్ అహమ్మద్ జీవితం ప్రశాంతంగా సాగాలని, ఆయురారోగ్యాలతో జీవించడంతో పాటు సమాజానికి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. డాక్టర్ ఎస్.ఇంతియాజ్ అహమ్మద్ మాట్లాడుతూ 1982లో కేవలం 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన నేషనల్ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ, నేడు 6 వేల మంది విద్యార్థులు, 300 మంది అధ్యాపకుల స్థాయికి ఎదిగిందన్నారు. విలువలతో కూడిన విద్యనందించడమే తమసంస్థ విజయ రహస్యమన్నారు. 32 ఏళు గా నేషనల్ విద్యా సంస్థల అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మంది సహకరించారని, వారందరికీ పేరు పేరున శిరస్సువంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల, పాఠశాలల కరస్పాండెంట్లు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, పలువురు డాక్టర్లు, ఇంజనీర్లు, పుర ప్రముఖులు హాజరై ఇంతియాజ్ అహమ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఉర్దూ అకాడమి ఛైర్మన్ ఎన్ఎండి నౌమాన్, నందిపరిశ్రమల ఎండి సజ్జల శ్రీధర్‌రెడ్డి, జిల్లా వృత్తి విద్యాధికారి టివి సుబ్రమణ్యేశ్వరరావు, ఆర్ఐఓ పరమేశ్వరరెడ్డి, సాగునీటి సాధన సమితి కన్వీనర్ బొజ్జ దశరథరామిరెడ్డి, జెసిఎల్ఎ సెక్రటరి హరీశ్వర ప్రసాద్, విశ్రాంత శాస్త్రవేత్త రవీంద్రనాథ్, నందిరైతు సమాఖ్య ప్రతినిధులు, ఎలక్ట్రిసిటి బోర్డు ఎస్ఇ పీరయ్య పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఫరూక్



ఇంతియాజ్ అహమ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు

నూతన ఏడాదిలో అందుబాటులో నాయకులు


ఆళ్ళగడ్డ రూరల్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజాప్రతినిధులు, నాయకులు అభిమానులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయా కార్యాలయాల ఇన్‌ఛార్జులు తెలిపారు. రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి భూమా అఖిలప్రియ స్వగృహంలో, వైసిపి ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి గంగులబిజేంద్రారెడ్డి(నాని) వారి స్వగృహం వద్ద, టిడిపి మాజీ ఇన్‌ఛార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఆయన సోదరులు టిడిపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలి

ఆళ్ళగడ్డ : విద్యుత్ ట్రాన్స్ ఫార్మరల్ వద్ద స్పెషల్ మెయింటెనెన్స్ కోసం సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండాలని యుఇయు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ స్పెషల్ మెయింటెనెన్స్ (యస్‌పియం) బృందంలో మొత్తం 13 మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌పిఎం కార్మిక సంఘం నాయకులు విద్యుత్ యస్‌సి భార్గవరాముడు, డిఇ ప్రదీప్‌కుమార్, ఏడిఇ నందయ్య, ఎఇ గురప్పలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్‌పిఎం కార్మికులకు ఒకే జీతం ఉండాలని, ఇఎస్ఐ, ఇపిఎఫ్‌లతోపాటు ఇన్సూరెన్స్, బోనస్, దుస్తులతోపాటు ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రతిభను పెంచే పోటీ పరీక్షలు

ఆళ్ళగడ్డ : పోటీ పరీక్షలు విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి ప్రతిభను పెంచేందుకు ఉపయోగపడతాయని అనంత విద్యా సంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డలోని అనంత డిగ్రీ కళాశాలలో వివేకానంద విశ్వమానవ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పరీక్షల వల్ల విద్యార్థుల్లో ప్రతిభ పెరగడంతోపాటు పరీక్షలంటే ఉన్న భయం కొంత వరకు తగ్గుతుం దన్నారు. అదే సమయంలో ప్రశ్నాపత్రానికి జవాబలు ఏవిధంగా, ఎలా రాయాలో అర్థమ వుతుందన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో పరీక్ష పట్ల అవగాహన పెరిగి ఎక్కువ మార్కులు సాధిం చేందుకు అవకాశం ఉందన్నారు. పరీక్షకు భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలోలో వివేకానంద విశ్వమానవ సేవాసమితి సభ్యులు శివప్రసాద్ పాల్గొన్నారు.



పోటీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఎస్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చాగలమర్రి

చాగలమర్రి ఎంఆర్‌సి భవనంలో ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం 2018 క్యాలెండర్, డైరీలను ఎంఇఒ అనురాధ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టుయు నిరంతరం పోరాడుతూ సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ఖాదర్, ఆర్థిక కార్యదర్శి శ్రీనాథరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు శివశంకర్, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రాజశేఖరరెడ్డి, సీనియర్ నాయకులు శేషాద్రి, ఉస్మాన్, గురు చంద్రుడు, సురేషప్ప, మోహన్‌రాజు, చంద్రవేఖర్, నిరంజన్ కుమార్, సుధాకర్‌గుస్తా, రమణరావు, వై.శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది గైబువలి పాల్గొన్నారు.

రామతీర్థ క్షేత్రంలో భక్తుల సందడి

ఆళ్ళగడ్డ రూరల్ : మండలంలోని ఆర్.కృష్ణాపురం పుట్టాలమ్మ క్షేత్రంలో వెలసిన రామతీర్థ క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పుట్టాలమ్మ, లక్ష్మి నరసింహా స్వామి, శ్రీ వల్లి దేవ సేన సుబ్రమణ్యేశ్వర స్వామి, పార్వతీ దేవీలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. పుట్టాలమ్మ తల్లికి భక్తులు చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

2018లో ప్రజలందరూ సుఖసంతోషాలతో గడపాలి

నంద్యాల : గత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ 2018 సంవత్సరాన్ని స్వాగతిస్తూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం, ఉపాధి, నిరుద్యోగ భృతి, పెన్షన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలుపుతున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు మస్తాన్‌వలి తెలిపారు.

పెద్దకంబలూరులో స్వచ్ఛ భారత్

రుద్రవరం : రుద్రవరం మండలం పెద్దకంబలూరు గ్రామంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఇఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో దాదాపు 20 మంది యువకులు గ్రామంలోని వీధుల్లో చెత్తచెదారాన్ని శుభ్రం చేసి మట్టిని తొలగించారు.

జన్మభూమిపై సమీక్షా సమావేశం

రుద్రవరం : రుద్రవరం మండలంలో జనవరి 2 నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమంపై ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం లో తహశీల్దార్ శివరాముడు, ఎంపిడిఒ నీరజలు మాట్లాడారు. జన్మభూమి జరిగే గ్రామాల్లో ఏ రోజుకు ఆ రోజు ఆయా శాఖలకు చెందిన అధికారులు ముందస్తు ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. ఆరోగ్య శాఖకు సంబంధించి హెల్త్ క్యాంపులు, పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులు, పెన్షన్లను మంజూరు చేసేందుకు సర్వే నిర్వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించేందుకు ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి టివి ఏర్పాటు చేయాలన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి

దొర్నిపాడు : దొర్నిపాడు పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.వేణుగోపాల్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 1993లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన వేణుగోపాల్‌రెడ్డి సుదీర్ఘ కాలంగా తుగ్గలి, చిప్పగిరి, ఆళ్ళగడ్డ, దొర్నిపాడు పోలీసు స్టేషన్లల్లో విధులు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందడంపై ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, ఎఎస్ఐ బాలచంద్రుడు అభినందించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ హుసేని, లక్ష్మినారాయణ సిబ్బంది పాల్గొన్నారు.



మిఠాయిలు తినిపిస్తున్న ఎస్ఐ



ప్రజాశక్తి
www.prajasakti.com
కర్నూలు
సోమవారం 01 జనవరి 2018

కోటి ఆశలతో... కొత్త సంవత్సరంలోకి..



ప్రతి ఏడాది మొదటిరోజు ఒకరి కొకరు కరచాలనం చేసి చెప్పకునే మాటే హ్యాపి న్యూ ఇయర్. ఏడాది విజయాలో, అపజయాలో మూల్యాంకనం చేసుకునో చేసుకోకనో నూతన సంవత్సరంలోకి అడుగిడేరోజిది. మతోన్మాదులేమో మనకు జనవరి 1 కాదు అనీ, ఉగాది అని ప్రచారం చేస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నా అరచేతినడ్డం పెట్టి సూర్య కిరణాలను ఆపడానికి ప్రయత్నించడమే అవుతుంది. సంప్రదాయకంగా వారి వారి విశ్వాసాలు, ఆచారాలకనుగుణంగా సంస్కృతి పరిరక్షణలో భాగాంగా కొత్త సంవత్సరాన్ని మనదేశంలో జరుపుకొంటున్నారు. ఆంధ్రదేశంలో ఉగాది, కేరళలో పూర్ణం విశూ, తమిళనాడులో పుత్తాండు, బెంగాల్‌లో నబో బార్షో, అసాంలో బిహూలను కొత్త సంవత్సరంగా పాటిస్తారు. ముస్లింలకు మొహరం పండుగతో నెల ఆరంభమవుతుంది. అందరి సాంస్కృతి, సాంపద్రాయాలు గౌరవించి కాపాడటమే భారతీయత, భారతదేశంలో కొనసాగుతున్న భిన్నత్వంలో ఉన్న ఏకత్వం. ప్రపంచం మొత్తం పరిగణించే జనవరి 1 కొత్త సంవత్సరానికి ఒక ఘనమైన చరిత్ర వుంది.

(ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్)

న్యూఇయర్ ఆవిర్భావం ఇలా..

క్రీ.పూ 400 సంవత్సరంలోనే న్యూఇయర్ ప్రారంభమైంది. రోమన్లు క్రీ.పూ 153 నుంచి జరుపుకుంటున్నారు. మొదట మార్చి 25ను న్యూఇయర్‌గా జరుపుకునేవారు. రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ జనవరి 1ని న్యూఇయర్‌గా మార్చినప్పుడు ఆ తేదిన రుతువులు ఏవి సరైన దిశలో ఉండవని గ్రహించాడు. మార్చి 25 నుంచి జనవరి 1ని న్యూఇయర్ డేగా మార్చినపుడు ఇబ్బందులు కూడా వచ్చాయి. గణింపులు, గుణింపులలో జరుగుతున్న అన్యాయాలను గ్రహించి అలెగ్జాండ్రాయాకు చెందిన గ్రీక్ ఆస్ట్రానమర్ సొసిజనిస్ ఎలాంటి అభ్యంతరాలు కలుగని ఈజిప్షియన్ సోలార్ కేలండర్ ఆధారంగా కొత్త కేలండర్ తయారు చేసి అమలుచేసి ఈక్వినాక్స్‌కు సొలిస్టిస్‌కు అనువైన జనవరి1ని న్యూఇయర్ డేగా ప్రకటించారు. ఈ క్యాలెండర్ ఏర్పాటు క్రీ.పూ 45లో జరిగింది. క్రీ.పూ 45 సంవత్సరం జనవరి 1న అమవాస్య కావడంతో అపశకునంగా భావించి ప్రజానీకం అభ్యంతరం వ్యక్తం చేశారు. రోమన్ చక్రవర్తి అవేమి పట్టించుకోకుండా క్యాలండర్ రూపకల్పనకు మొదట మార్గం చూపిన జూలియస్ సీజర్ సేవలను కొనియాడి ఆయన జన్మించిన క్వింటిలిస్ మాసానికి జులై అని పేరు పెట్టాడు. జూలియస్ సీజర్ బంధువైన అగస్టస్ సీజర్ తొలి క్యాలెండర్ రూపకల్పనలో జూలియస్ సీజర్ చేసిన కొన్ని తప్పులను అంటే లీపు ఇయర్ గణింపులో జరిగిన పొరపాటును సరిచేశారు. స్పెక్టిసలైటిస్ అనే నెలకు ఆగస్ట్‌గా పేరు మార్చారు. అప్పటి నుంచి 4 సంవత్సరాలకు ఒకసారి లీపు సంవత్సరం వచ్చే ఆచారం అమలయ్యింది.



ఇది 1582 వరకూ సాగింది. 1582లో పోప్ గ్రెగరీ క్యాలెండర్‌లో కొన్ని మార్పులు చేశాడు. అక్టోబర్‌లో 10 రోజులు మినహాయించి 1582 అక్టోబర్ 4న గురువారం తర్వాత అక్టోబర్ 15 శుక్రవారం వచ్చేలా చేశాడు. సెంచరీలను 400తో భాగించి లీప్ ఇయర్‌గా పరిగయించడం వల్ల తేడాలొచ్చాయి. అందుకే 1700, 1800, 1900 సంవత్సరాలు లీపు ఇయర్స్ కావాల్సి ఉన్నా కాలేదు. కానీ 2000 సంవత్సరం లీప్ ఇయర్ అయ్యింది. ఈ క్యాలెండర్ ను జర్మనీ 1700 సంవత్సరంలో గ్రేట్ బ్రిటన్ 1752లో, స్వీడన్ 1753లో అనుసరించాయి. ఈ క్యాలెండర్ క్రైస్తవులు రూపొందించినా అధికారిక క్యాలెండర్‌గా హిందువులు, ముస్లీంలు, బౌద్దులు అంగీకరించారు. రష్యా 1918లో ఈ క్యాలెండర్‌ను అమలు చేసి వద్దనుకుని వారి సంప్రదాయక క్యాలెండర్‌ను అమలు చేసింది. 1924లో జనవరి 1ని న్యూ ఇయర్‌గా ప్రకటించింది. అప్పటి నుండే ప్రపంచమంతా న్యూఇయర్ ను జనవరి1న జరుపుకుంటున్నారు. ప్రతి నెలకు ఒక్కో పేరు ను నిర్ధారించి పెట్టారు. అంటే జేవరు అనే రోమ్ దేవత పేరును జనవరి నెలగా, ఫెరు అనే రోమన్ పండుగ పేరు ఫిబ్రవరిగా, రోమన్ యుద్ధదేవత అయిన మార్చిని మార్చి నెలకు పెట్టారు. ఎపెరిర్ అనే లాటిన్ భాషా శబ్దం నుంచి ఏప్రెల్ ఏర్పడింది. రోమన్‌ల దేవి పేరు మయిమా అనే పదం నుంచి మే నెల ఆవిర్భవించింది. రోమన్లు స్వర్గానికి రాణిగా భావించే జానోను జూన్‌గా పెట్టారు. సెప్టెంబర్ అనే లాటిన్ పదం నుండి సెప్టెంబర్, ఆకో అనే లాటిన్ పదం నుంచి అక్టోబర్, నవమ్ అనే లాటిన్ పదం నుండి నవంబర్, డసమ్ అనే లాటిన్ పదం నుండి డిసెంబర్ అనే పేర్లొచ్చాయి.

గ్రీటింగు కార్డులు, బహుమతులు..

ఒకరినొకరు కరచాలనం చేసుకుని శాభాకాంక్షలు చెప్పుకోవడం ఆనవాయితే. కాగితం కనిపెట్టాక మనసులోని భావాలకు అక్షర రూపమిచ్చి ఈ ఏడాదంతా కొత్త అశయంతో కొనసాగాలని శుభాకాంక్షలు తెలుపుకునేవారు. ప్రస్తుతం ప్రపంచీకరణ పుణ్యమాని అన్నీ ముద్రించబడి వస్తున్నాయి. అవి మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యాపారంగా మారిపోయింది. అధికారులకైతే కింది స్థాయివారు కొత్త సంవత్సరం రోజున ఉన్నతాధికారులకు బహుమతులిచ్చి ప్రసన్నం చేసుకోవడం మామూలే. కొత్త సంవత్సరం నాడు కోట్ల రూపాయల వింద ,వినోదాలకు ఖర్చు చేయడం వల్ల ఒనగూరే ప్రయోజనం లేదు. అనాదాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఆ డబ్బును వెచ్చిస్తే సమాజం కోసం కొత్త సంవత్సరాం నాడు సేవ చేసిన వారమవుతాము. కొత్త సంవత్సరం జనవరి 1న మనం 2018లోకి అడుగిడుతున్నాం. అసమానతలు లేని సమాజం దిశగా, అత్యాచారాలు, హత్యలు, మారణహోమాలు లేని సంవత్సరంగా, విధ్వంసాలకు కారణం కాని కాలంగా, ప్రకృతి వైపరిత్యాల బారిన పడని సంవత్సరంగా కొనసాగాలని కమ్మని కలలతో కొత్త సంవత్సరాన్ని స్వాగతిద్దాం...

అంబరానంటిన కొత్త సంవత్సర సంబరాలు


ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కొత్త సంవత్సరం.. అందరికీ కొత్త నిర్ణయాలు, కొత్త ఆలోచనలు, కొత్త ఆశలకు వేదిక కానుంది. ప్రతి యేటా డిసెంబర్ 31 అర్ధరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిం చుకుంటారు. గ్రీటింగ్ కార్డులు, స్వీట్లు, పుష్పగుచ్ఛాలు, పళ్ల ఇచ్చిపుచ్చుకుంటారు. రాత్రి 12 గంటలు దాటిన వెంటనే ప్రజలందరూ కేకులతో నోరు తీపి చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకుంటారు. క్రైస్తవులు క్రిస్మస్ తర్వాత జనవరి 1వ తేదీని కూడా పండుగలా జరుపుకుంటారు. ప్రతి చర్చి దీపకాంతులతో వెలిగిపోతుంది. కొత్త సంవత్సరం మంచి జరగాలని రాత్రంతా దేవుని ఆరాధనలో ఉంటూ నూతన సంవత్సరంలోకి అడుగు పెడతారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రత్యేక అలంకరణలతో కొత్త సంవత్సర శోభను సంతరించుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నతాధికారులను కలిసి పండ్లు, స్వీట్లు, బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు చెబుతారు. బొకేలకు బదులుగా పర్యావరణాన్ని రక్షించేలా మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పాలని జిల్లా కలెక్టర్ సత్యన్నారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సర సంబరాల్లో అపశృతి చోటు చేసుకోకుండా యువత జాగ్రత్తలు పాటించాలి జిల్లా ఎస్పీ గోపినాథ్ జెట్టి కోరారు. యువతను బయటికి పంపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. మద్యం సేవిచడం, వాహనాలు వేగంగా నడపడం చేయకుండా సంతోషంగా వేడుకలను ఆస్వాధించాలని పోలీసు శాఖ, విద్యావేత్తలు మరీ కోరుతున్నారు.

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు
డాక్టర్ చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలి. దురలవాట్లకు దూరంగా ఉండండి. మంచి ఆహారం తీసుకుంటూ, కనీసం రోజుకు గంట పాటు వ్యాయామం చేస్తూ మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోండి. ఫాస్ట్ పుడ్స్‌ను తీసుకోవద్దు. బైకులపై అల్లర్లు చేయవద్దు. అందరూ దురలవాట్లకు దూరంగా ఉండండి. ఆరోగ్యమే మహాభాగ్యమని తెలుసుకోండి.

సుఖ, సంతోషాలతో గడపాలి : డాక్టర్ శంకర్ శర్మ, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్



నూతన సంవత్సరంలో కర్నూలు జిల్లా ప్రజలు శుఖ శాంతులతో.. సంతోషంతో గడపాలి. జిల్లాలో వానలు బాగా పడి, పంటలు బాగా పండి రైతులు శుభిక్షంగా ఉండాలి. కుల మతాలకు అతీతంగా ఒక సోదర భావంతో ప్రజలు మెలగాలని కోరుతున్నాను. ఈ సంవత్సరంలో జిల్లా కొత్త అభివృద్ధికి నోచుకోవాలని కోరుతున్నాను.

హక్కుల కోసం పోరాటాలు చేద్దాం - ఎంఏ గఫూర్,సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు



నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగ, కార్మిక వర్గానికి, ప్రజానికానికి శుభాకాంక్షలు. ఇప్పుడు ఉండే ప్రభుత్వాలు నూతన సరళీకరణ విధానాలతో, ప్రజలకు వ్యతిరేకంగా పని చేస్తూ మన ఆనందాన్ని కోల్పోయేలా చేస్తున్నాయి. ఈ సంవత్సరంలో మన హక్కులు కాపాడుకోవడానికి మరింత పోడాల్సిందిగా కోరుతున్నాను. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

2018 అందరికీ శుభకరంగా ఉండాలి
కె.ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి



2108లో కర్నూలు జిల్లా ప్రజలందరూ శుభకరంగా, సంతోషదాయకంగా ఉండాలి. ప్రభుత్వాలు, పాలకులు నుంచి కొత్త బాధలు రాకుండా, భారాలు పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి విధానాలు రూపొందించాలని కోరుతున్నాను. ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలి. మతోన్మాదానికి వ్యతిరేకంగా చేతన్య వంతమైన ఉద్యమాల్లో చురుకుగా యువత, ప్రజా సంఘాలు పాల్గొనాలి.

నూతన సంవత్సరంలో మద్యంను అరికట్టాలి : పి.నిర్మల, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు



కొత్త సంవత్సరంలో మద్యంను ప్రభుత్వం అరికట్టాలని కోరుతున్నాను. మహిళలపై హింసకు కారణమైన మద్యంను ఎవరూ తీసుకోకూడదు. సినిమాలు, సీరియళ్ల వల్ల ప్రజలపై చెడు ప్రభావం పడుతోంది. మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయి. మహిళలు కరాటే లాంటి విద్యలు నేర్చుకొని తమను తాము కాపాడు కోవాలని కోరుతున్నాను. విద్యార్థులు ఆత్మ స్థైర్యంగా ఉండాలి.

తెలుగు తల్లి రక్షణలో ఆ ఇద్దరు

తెలుగు భాషను బతికించాలంటే కోట్లు ఖర్చు పెట్టి ఆర్భాటంగా సభలు జరపవలసిన పనిలేదు. మనసులో తల్లి భాషను బతికించాలన్న తపన ఉంటే చాలు. అలాగే పాఠశాలతోనే చదువు ఆగిపోయినా కవులుగా మారవచ్చు. పెద్దగా చదవకపోయినా జీవితాన్ని చదివితే చాలని నిరూపించేవారెందరో ఉన్నారు. తమకు మంచిది అనిపించిన అంశాన్ని వ్యక్తం చేయటానికి తల్లి భాషే మిన్న అని తలపోసే వారెందరో. ఆ కోవకే వస్తారు. ఆస్పరి మండలం హలిగేర గ్రామానికి చెందిన గొల్ల ఆంజనేయులు యాదవ్, నగరూరుకు చెందిన కలికి రామక్రిష్ణప్ప. పాఠశాల చదువు కూడా పూర్తి చేయని వారి దగ్గర నేర్చుకోవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. వారిగురించి నేటి కర్నూలు కవనం.






గొల్లఆంజనేయులుయాదవ్: జి.ఆంజ నేయులు యాదవ్ 1944 నవంబరు 28న జన్మించారు. తల్లి తాయమ్మ, తిమ్మయ్య. ఆంజనేయులు తొమ్మిదో తరగతి దాకా చదువుకున్నారు. గొల్ల శరవమ్మ ఆయన సతీమణి. ఆయన గురువులు సుమిత్రయ్య, లూర్దయ్య, జోజమ్మలను ఎప్పుడూ స్మరిస్తుంటారు. గురువును మించిన దైవం లేదని చెబుతారు. ఆంజనేయులు ముద్రిత రచనలు నిర్వచన రామాయణము, సుసూత్కుల పథము 350, కవితా కదంబము. హలిగేర అల్లా అక్బరుస్వామి మహత్యము, సుసూక్తుల పథము 850, అంతర్యాములు తదితర ఇంకా ముద్రించవలసి ఉంది.

ఆయన కవితా కదంబము పుస్తకం పద్య రూపంలో కనిపించినా అది స్వేఛ్ఛా కవిత్వమని రచయితే పేర్కొంటారు. ఛందస్సు పరంగా రాయకపోవటం వారి ప్రత్యేకత. కవిత్వం పద్య రూపంలోనే ఉండాల్సిన పనిలేదన్న మహాకవుల మాటలను వీరు పాటించి కవిగా పేరు తెచ్చుకున్నారు. అందులో "గుండుమల్లెల గుండెల గుండుసూది/ గ్రుచ్చిగ్రుచ్చియు దారం కూర్చి కూర్చి/ మాలగట్టియు మగువ మేలిజడను/ ముడుచుకొన్నను నొవ్వక మురియుచుండు/ మెత్తని మగువ మనసులు/ కుత్తుకలోనను శరమల గ్రుచ్చెడి రీతిన్/ మెత్తనిమగువలు సూదుల/ నెత్తుగ్రుచ్చెదరని నవ్వి నేడ్చుచుండన్" అని పుష్ప విలాప పద్యాలను మనముందుంచుతారు. "మతములన్నియు బోధించు మంచియొకటె/ పార్టిలన్నింటి లక్ష్యమ్ము ప్రజలసేవె/ ప్రజలమనిషికి నోటేయ ఫలితముండు/ మంచివానిని గెలిపించి మంచిబెంచు" అని వోటర్లకు హితబోధ చేస్తారు. కవిత్వం ఎలా ఉండాలో ఇలా చెబుతారు "రసములేని కవిత రసహీనమౌ కదా/ ప్రియములేని ప్రియుని ప్రేమపగిది/ రసములేని కవిత రాసిన ఫలమేమి/ సరసకవిత యొకటి చాలు చదువ". స్త్రీ స్వేచ్ఛపై "స్వాతంత్ర్యమొచ్చెకాని/ స్వాతంత్ర్యము స్త్రీలకెపుడు వచ్చునోరాదో/ మనసుక్నకు మెచ్చు మగనిని/ పరిణయమాడంగలేరు భారత కన్యల్" అని తమ భావాలను తెలుపుతారు. పేదల గురించి రాస్తూ "పయినిండ గుడ్డలేకయు/ కడుపునకున్ కూడులేక కటకబడుచున్/ తలదాచ గూడులేకయు/ అతిదీనత బీదబ్రతుకు బీదబ్రతుకు చావని బ్రతుకుల్" అని బాధ వ్యక్తం చేస్తారు.

"సుస్సూక్తుల పథము"లో ఎన్నో సూక్తులు చెప్పారు. అప్పులేనివాడు ఐశ్వర్యుడని చెబుతారు. ఏదిజారినా నోరు జారొద్దంటారు. "నిజమైనను పరులకు కీడుకలిగించు నిజము చెప్పరాదు" అని లౌక్యం చెబుతారు. "గోరంత పాపమునకు కొండంత పుణ్యముచేసినను సరిపోదు" అని పాపాన్ని పుణ్యం పోగొట్టదంటారు. అనుకూల దాంపత్యము అష్టకష్టములను తొలగించునని భార్యా భర్తలు కలిసి ఉంటే ఎన్నో విజయాలు సాధించవచ్చునని నేటి యువతకు హితబోధ చేస్తారు. ప్రస్తుతం అనారోగ్య కారణంగా రచనలకు దూరంగా ఉన్నవీరు త్వరలోనే కోలుకొని తల్లి భాషకు సేవలందిస్తారని కోరుకుందాం.

కలికి రామక్రిష్ణప్ప: నగరూరుకు చెందిన రామకష్ణప్ప జనవరి ఒకటో తేది 1953 లో జన్మించారు. తల్లి హనుమంతమ్మ, తండ్రి శ్రీనివాసులు.





వ్యయసాయ కుటుంబం. ఐదవతరగతి వరకు చదువుకున్నారు. వీరి సతీమణి యంకమ్మ. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.



వీరి రచనలు శ్రీనివాస శతకము, లోకం పోకడ, తెలుగు భాషా శతకము. వీరు రచనలతో పాటు భారతం, భాగవతం, భగవద్గీత శ్లోకాలు చదివి వినిపించి వాటి విశ్లేషణ కూడా చేస్తారు. రేడియో, టివీల్లో వీరి ప్రసం గాలు వచ్చాయి. అవధానాల్లో ప్రుచ్ఛకులుగా పాల్గొంటారు. ప్రముఖ అవధానులు గండ్లూరి దత్తాత్రేయ శర్మ, ఆశావాది ప్రకాశరావు, ఆముదాల మురళి, అవధానం సుధాకర శర్మ మొదలైన వారి అవధానల్లో పాల్గొన్నారు. కష్టపడి పద్యాలు రాయటం నేర్చుకున్నారు. భావాన్ని సరళంగా చెప్పటం వీరి పద్యాల్లోని ప్రత్యేకత.

తెలుగు భాషా శతకము లోని పద్యాలు తెలుగు వెలుగొందజేయుమా తెలుగు వాడ అన్న మకుటంతో ముగుస్తాయి. ఇందులోని పద్యాల్లో ఇంకో ప్రత్యేకత ఉంది, మిగిలిన మూడుపాదాల్లో ఎక్కడో ఒక చోట తెలుగు అన్న పదం ప్రతి పద్యంలోనూ మనకు కనిపిస్తుంది. తెలుగు భాషపై వీరికున్న మమకారాన్ని మనం సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఎందరో తెలుగు కవులను అందులో పరిచయం చేస్తారు. ఉదాహరణకు "వేమనెంతటి పద్యముల్ వేగదెల్పె/ నాట్యమాడించె తెలుగులోనాటవెలది/ జనులకర్థంబగురీతి కనులకెదుట/ ప్రజల కవియంచునీతడు వాసికెక్కె". సుమతి శతకం, వేమన శతకం మొదలైన వాటిపై కూడా పద్యాలు రాశారు. ఆంధ్రభూమియందు తెలుగు కాదరణయు/ చాలవరకు తగ్గె ప్రజల చదువులందు/ మనసులో బాధ తెల్పి మన సహెూద/ రులకు పాటించరే మీరు రూఢిగాను" అని తెలుగు భాషను బతికించమంటారు రామక్రిష్ణప్ప. పల్లెలపై రాస్తూ "పట్టుకొమ్మలు దేశాన పల్లెటూళ్ళు/ వలసపోయిరి బ్రతుకగా పల్లెవారు/ పట్నవాసంబుపోయిన పల్లప్రజల/ తెలుగుమాటాడ మరచిరి తిక్కబట్టి" అంటూ వారి జీవితాలతో పాటు తల్లి భాష గురించి కూడా చెబుతారు. "జానపదులలో కళలెన్నొ జాలువారు/ వారి ఆట్పాటలు నేదు వదలినారు/ తెలుగు ఆనాడు పలికెను చిలుకవోలె/ చలనచిత్రాల మోజులో తెలియరైరి" అని జానపద కళలను ప్రోత్సహించమని చెప్పకనే చెబుతారు. శ్రీనివాస శతకంలో దశావతారాల గురించి చెప్పటమే కాక మనిషికి నిజ జీవితంలో ఉపయోతపడే ఎన్నో విషయాలు చెబుతారు. "పుట్టినట్టి జీవి గిట్టక తప్పదు/ గిట్టు జీవి కూడ పుట్టు నిజము/ పుట్టి గిట్టని పట్టును జూపెట్టు/ శ్రీగిరీశ శ్రీశ శ్రీనివాసా" అని "ఆంధ్రుడగుటవలన ఆశయంబు తీరె/ తీయనైన పలుకు తేట పడగ/ దేశ భాషలందు తెలుగు లెస్సగాదె" అంటారు.

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అన్న మాటను నిజం చేస్తూ పల్లెలే తెలుగు భాషను కూడా కాపాడగలవన్న నమ్మకాన్ని ఆంజనేయులు, రామక్రిష్ణప్పగార్లు కలిగిస్తారు. వారిద్దరూ సాహిత్య సేవ కొనసాగించి ఇంకెన్నో రచనలు చేస్తారని కవనం ఆశిస్తోంది.

- జంధ్యాల రఘుబాబు

గడువు తీరితే గండమే

గ్యాస్ సిలిండర్ల గడువు తేదిపై అవగాహన కరువు

ప్రజాశక్తి - వెల్దుర్తి

మనం వినియోగించే ప్రతివస్తువుకు కాలపరిమితి ఉంటుంది. నిత్యం వంట గదిలో మనం ఉపయోగించే గ్యాస్ సిలిండర్‌కు గడువు ఉంటుందన్న విషయం చాలామందికి తెలియదు. కాలం చెల్లినవి వినియోగించడం ప్రమాదకరమని అనేకమందికి తెలియదు. అందుకే ఆ గడువుతేదిని గుర్తించడం ఎలాగో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మన ఇంట్లో ఉండే ప్రమాదకర వస్తువుల్లో గ్యాస్ సిలిండర్ కూడా ఒకటి. అందుకే సిలిండర్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా గ్యాస్ సిలిండర్ గడువు తేదిని గుర్తించాలి. సిలిండర్‌పై ఉన్న రింగ్‌కు కింది భాగంలో మూడు ఇనుపబద్దెలు ఉంటాయి. వాటిలో ఒకదానిపై లోపలి వైపున సిలిండర్ గడువుతేది ముద్రించబడి ఉంటుంది. అయితే సిలిండర్‌కు వేసి ఉన్న అంకెలు, తేదీలను అవేంటివో అని చాలా మంది పట్టించుకోరు. కానీ రింగ్‌కు కింది భాగంలో బద్దెపై ముద్రించి ఉన్న తేదీల్లో ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ప్రతి మూడు నెలలకు ఒక ఆంగ్ల అక్షరం రాసి ఉంటుంది.

మూడు నెలలకో అక్షరం : సంవత్సరంలోని 12 నెలలను నాలుగు భాగాలుగా (క్వార్టర్స్‌గా) విభజించి వాటికి ఆంగ్లబాషలోని మొదటి నాలుగు అక్షరాలు ఎ, బి, సి, డి లని వ్యవహరిస్తారు. అందుకోసం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఎతో, ఏప్రిల్, మే, జూన్ వరకు బితో, జూలై, ఆగష్టు, సెప్టెంబర్ సితో, అక్టోబరు, నవంబరు, డిసెంబర్ వరకు డితో గుర్తిస్తారు. ఉదాహరణకు సిలిండర్ పై బి17 అనే రాసి ఉంటే 2017 జూన్ వరకు మాత్రమే వినియోగించాలని తెలుసుకోవాలి. ఆనెల దాటితే సిలిండర్‌కు కాలం చెల్లిందని తెలుసుకొని దూరం పెట్టాలి.

గడువు తేదీల సిలిండర్లు ప్రమాదమే : కొందరు సిలిండర్లు కొన్న తరువాత నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. మరికొందరు బ్లాక్‌లో కొని మరి వాడుతుంటారు. అయితే సిలిండర్లపై గుర్తించిన గడువు తేదిలోగా వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్లను వాడడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి సిలిండర్లు సంబంధిత గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌కు వాపస్ చేయాలి. ముఖ్యంగా సిలిండర్ తీసుకునే తేది నాటికి, వాడుకునే తేది నాటికి గడువు నెలలు గమనించి వాడుకోవాలి.

ఖాళీ సిలిండర్లకు గడువు : ఖాళీ సిలిండర్లకు కూడా నిర్ధిష్ట కాలపరిమితి ఉంటుంది. అయితే ఇది వినియోగదారులకు సంబంధం లేదు. ఖాళీ సిలిండర్ కాలపరిమితి 7 ఏళ్లు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నెంబర్ల ప్రకారం 7 ఏళ్లు దాటిన సిలిండర్లను డీలర్ల నుంచి వెనక్కు తెప్పించుకొని పరీక్షిస్తారు. ఏ మాత్రం వినియోగ యోగ్యం కానీ, నాణ్యత లేని సిలిండర్లను తయారీదారులు తుక్కుగా పరిగణించి పక్కన పెట్టేస్తారు.

అవగాహన కల్పించాలి : గ్యాస్ సిలిండర్లకు గడువు తేది విషయం వినియోగదారులకు చాలామందికి తెలియదు. గ్యాస్ ఏజెన్సీ వాళ్లు, అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గడువు తీరిన సిలిండర్ల వాడకం ఎంతో ప్రమాదం. అటు గ్యాస్ ఏజెన్సీ వాళ్లు, ఇటు వినియోగదారులు గ్యాస్ సిలిండర్లపై ఉన్న గడువు తేదీలను గమనించి వాడుకోవడం మంచిది.





ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి ప్రజాశక్తి 2018 క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జి మద్దయ్య, పిసి ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు రాయలసీమ సలాం, కాశీం పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి స్వాగతం

ప్రజాశక్తి - డోన్

ప్రార్థన సమయం నిర్వాహకులు జాన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దలు, వృద్ధులు సత్యాన్వేషణ గ్రంథాలయంలో ఆదివారం క్యాండిల్లను వెలిగించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికి శుభాలు జరగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ప్రేమాను రాగాలతో జీవించినప్పుడే శాంతి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ రఫీ, ఆదాము, ధనుంజయ, రామాంజనేయులు పాల్గొన్నారు.



క్యాండిల్లను వెలిగించి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

సిపిఐ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - డోన్

సిపిఐ డోన్ నియోజకవర్గానికి, పట్టణానికి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. డోన్ నియోజకవర్గ కార్యదర్శిగా రంగనాయుడు తిరిగి మూడోసారి, పట్టణ కార్యదర్శిగా నక్కి శ్రీకాంత్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడా నికి కృషి చేస్తామన్నారు. ప్రజల పక్షాన నిరంతర పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. పలువురు ప్రజాసంఘాల నాయకులు వీరిని అభినందించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం రాజగోపుర నిర్మాణానికి రూ.25 లక్షల చెక్కును అఖిల భారత తోగటవీర క్షత్రీయ సంఘం గురూజీ దివ్యజ్ఞానణాంద స్వామి విరాళంగా ఇచ్చారు. ఆదివారం మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానం దక్షిణ రాజగోపుర నిర్మాణానికి రూ.25 లక్షల చెక్కును ఆలయ చైర్మన్ పివి కుమార్‌రెడ్డి, ఆలయ ఇఒ రామానుజన్‌లకు అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత తోగటవీర క్షత్రీయ సంఘం ప్రధాన కార్యదర్శి చింత శ్రీనివాసులు, ట్రస్టు ఛైర్మన్ నరసింహులు, ట్రస్టు ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు దేవదాసు, పల్ల శేషయ్య, పుల్లయ్య, మాదం శ్రీనివాసులు, సీతరామయ్య పాల్గొన్నారు.



నిర్మాణానికి చెక్కును అందజేస్తున్న పివి కుమార్‌రెడ్డి

ప్రజలకు ఎమ్మెల్యే బిసి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బనగానపల్లె

2018 సంవత్సరంలో ప్రజలకు సకల శుభాలు కలగాలని ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు ఆయన తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి ప్రజాశక్తితో మాట్లాడారు. 2017లో ప్రజలు కష్టాలు పడ్డారని అన్నారు. 2018లో నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆర్థికంగా ఎదగాలని కోరారు. అసూయ ద్వేషాలు పెట్టుకోకుండా సంతోషంగా జీవించాలన్నారు.రైతులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికుల జీవితాలు అభివృద్ధిలోకి రావాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేసినట్లు తెలియజేశారు. అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందాలనే ధ్యేయంతో పని చేస్తున్నానని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు హితోధికంగా కృషి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశానన్నారు. కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గంలోని అన్నీ పాఠశాలలకు అదనపు గదులను నిర్మించామన్నారు. సొంత నిధులతో అన్ని గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నాపై నమ్మకంతో అత్యధిక మెజార్టీతో గెలిపించారని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రెయినేజీని నిర్మించామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. సంక్రాంతి పండగ సంతోషంగా జరుపుకునేందుకు చంద్రన్న కానుకలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే జన్మభూమిలో రేషన్ కార్డులు, అర్హులైన వితంతవులకు, వికలాంగులకు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేస్తామని తెలిపారు.

కొత్త ఏడాదిలో ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి-బనగానపల్లె

ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2018లో ప్రజలు సంతోషంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. టిడిపి దుష్ట పాలనలో ప్రజలు విసిగి పోతున్నారని, చంద్రబాబు పాలనలో ప్రజలకు అన్ని కష్టాలే ఎదురవుతున్నాయన్నారు. 2018లోనైనా సంమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, కార్మికులు సంతోషంగా జీవించాలని కోరారు. టిడిపి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడం, అవినీతితో ప్రజలు విసిగి వేసారి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ రంగాల్లో విఫలమయ్యాయని, టిడిపి పాలనలో ప్రజలకు పన్నుల భారం తప్ప సంతోషం లేదన్నారు. చంద్రబాబు ఎన్నో అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశానని తెలియజేశారు.

శివాలయ కంచె పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పాతిమీద జ్యోతి పరమేశ్వర, అమృత హస్త ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధిలో భాగంగా ఇనుప కంచె నిర్మాణానికి ఎస్ఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఐరన్ పోల్‌ను నిలబెట్టి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన కంచె నిర్మాణం, గుడి పరిసరాల్లో ఔషద మొక్కల నక్షత్ర వనం, మహ నాగేంద్రుని విగ్రహం ఏర్పాటు, కళ్యాణ అరుగు, షెడ్ నిర్మాణం, రెండు దేవాలయాల గోపురాల నిర్మాణాలపై చర్చించారు. కార్యక్రమంలో పవన్ సోదరులు శ్రీనివాసరెడ్డి, జగన్‌రెడ్డి, భక్తవత్సళ్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఆర్మీ శ్రీను, పూజారి సుంకన్న, కేశాలు, చిన్న బుజ్జి, అబ్దుల్లా పాల్గొన్నారు.



ఇనుప కంచెను నిర్మాణానికి ఐరన్ పోల్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ మంజునాథ్

10న యాగంటిలో వేలం పాటలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వర దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ ఆదిశేషనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో పండ్లు, బొమ్మల అంగడి, తలానీలాల ప్రోగు, కొబ్బరి చిప్పల ప్రోగు, ఐస్‌క్రీం అమ్ముకునే హక్కు, టెంకాయలు అమ్మేందుకు, చెప్పుల స్టాండు కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు దేవస్థానంలో వేలంపాటలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గలిగిన వారు వేలం పాటల్లో రూ.50 వేలు దారవత్తు చెల్లించి పాల్గొన్నాలని తెలిపారు.

2 నుంచి జన్మభూమి-మా ఊరు

విజయవంతం చేయాలని అధికారుల ఆకాంక్ష

బనగానపల్లె అర్బన్ : జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంపై మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు విఆర్‌ఒలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వచ్చే ప్రజా వినతులు, సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 5వ విడత జన్మభూమి-మా ఊరు 2వ నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తునట్లు తెలిపారు. మండల ఉపాధ్యక్షులు కైప శివలింగారెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు బషీర్ అహమ్మద్, ఎంపిడిఒ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయిక్రిష్ణ, వ్యవసాయాధికారి విజయకుమార్, ఎంఇఒ స్వరూప, ఎపిఎం నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఎపిఒ ప్రతాప్, ఆర్ఐ రవీంద్ర, సూపరిండెంటెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సోమశేఖర్‌రెడ్డి

ప్యాపిలి : 2వ తేదీ నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ అమృతరాజ్ కోరారు. ఆదివారం మండల కార్యాలయం నందు అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీన జరిగే జన్మభూమి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అనంతరం అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజూ క్రీడా పోటీలను, సాంస్కృతిక పోటీలను నిర్వహించాలని చెప్పారు. ప్రతి పంచాయతీకి ఒక స్పెషల్ అధికారిని నియమించామన్నారు. జన్మభూమి కార్యక్రమాన్ని ప్రతి రోజూ పండగలా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని మండల శాఖ అధికారులు, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

బేతంచర్ల : జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పండగలా నిర్వహించాలని ఎంపిడిఒ మోహన్‌కుమార్, మండల అధ్యక్షురాలు జి.కిట్టమ్మ కోరారు. ఆదివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మోహన్‌కుమార్ మాట్లాడుతూ 2వ తేదీ నుంచి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం 5వ విడత జన్మభూమి అన్నారు. 2న అంబాపురం, ఆర్‌ఎస్ రంగాపురం, 3న గూటుపల్లె, తవిసి కొండ, 4న రహీమాన్‌పురం, హెచ్ కొట్టాల, 5న ఆర్ బుక్కాపురం, ఆర్ కొత్తపల్లె, 6న ఎం పెండేకల్, ముద్దవరం, 7న గోర్లగుట్ల, కొలుములపల్లె, 8న బుగ్గాన్‌పల్లె, సిమెంట్‌నగర్, 9న యంబాయి, సంకలాపురం, 10న సీతరామాపురం, గోరుమానుకొండ, 11న బేతంచర్ల, కెకె కొట్టాల గ్రామాల్లో ఉంటుందని చెప్పారు. ఆయా గ్రామాల రచ్చబండల వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ టీం, తహశీల్దార్ టీం ఆయా శాఖల అధికారుల సమన్వయంతో గ్రామాల్లోని మౌలిక వసతులపై చర్చిస్తారన్నారు. గత మూడేళ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన వారు గృహాలకు, పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బేతంచర్ల సర్పంచి రోజమ్మ, బేతంచర్ల ఇఒ నాగేంద్రుడు, ఎంఇఒ సోమశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో కొత్త ఏడాది వేడుకల కోలాహలం

ఆకాశాన్నంటిన కేక్, పూలు, చికెన్, పండ్ల ధరలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

నూతన సంవత్సరం 2018 వేడుకల సందర్భంగా ఆత్మకూరు పట్టణం ఆదివారం ప్రజలతో కిటకిటలాడింది. గతంలో ప్రజలు గ్రీటింగ్‌కార్డులు కొనుగోలు చేసేవారు. నేడు గ్రీటింగ్‌కార్డు కొనుగోలుదారులు మచ్చుకైనా కానరావడం లేదు. ప్రధానంగా వస్త్రదుకాణాలు, పూల దుకాణాలు, బేకరీల వద్దకు ప్రజలు కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున వచ్చారు. పూలదుకాణ వ్యాపారులు కిలో బంతి, చామంతి పూలు రూ.100, దండలు రూ.100 నుండి రూ.200 అమ్మకాలను సాగించారు. కేక్‌లు అరకిలో రూ.100తో పాటు బోనస్‌గా 250 ఎంఎల్ థమ్స్‌ప్, ఇతర కూల్‌డ్రింక్స్ ఉచితంగా అందిస్తున్నట్లు ఫ్లెక్సీ బోర్డులు పెట్టారు. కిలో కేక్ రూ.200తో పాటు 400 ఎంఎల్ కూల్‌డ్రింక్స్‌ను ఉచితంగా అందిస్తున్నారు. పోలీసు అధికారుల ఆంక్షల నేపథ్యంలో సాయంత్రం నుండే మద్యం దుకాణాలు మద్యం ప్రియులతో కిటకిటలాడుతున్నాయి, ఒకవైపు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోరాదని హిందు మతవాదులు కరపత్రాల ద్వారా ప్రచారం చేసినప్పటికీ పెద్దఎత్తున ప్రజలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా స్వాగతం పలికేందుకు ప్రతి ఇంటి ముందు రంగవళ్లులు వేసేందుకు మహిళలు రంగులను విపరీతంగా కొనుగోలు చేశారు. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే బుడ్డా.రాజశేఖర్‌రెడ్డి నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఆఫీసులో ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. సిపిఎం డివిజన్, మండల నాయకులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త బుడ్డా.శేషారెడ్డి వేల్పనూరు గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు సమాచారం. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు శిల్పా.చక్రపాణిరెడ్డి ఆత్మకూరులో ఉండడంలేదని తెలిసింది. ఏదేమైనప్పటికీ 2018 నూతన సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు ప్రజలు ఆనందంతో ముందున్నారు.



వినియోగదారులతో కిటకిటలాడుతున్న పూల అంగళ్లు



ప్రజలతో కిట కిటలాడుతున్న బేకరీ దుకాణాలు

మరణించిన వారి పేరుతో ఉపాధి బిల్లులు : వ్యకాస

ప్రజాశక్తి-పగిడ్యాల

మరణించి మూడు సంవత్సరాలైన వ్యక్తి పేరుతో ఉపాధి బిల్లులను చేసుకుని దోపిడీ చేస్తున్నారని వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.ఈశ్వరమ్మ, మండలాధ్యక్షులు ఎం.లక్ష్మన్న విమర్శించారు. ఆదివారం మండలంలోని నెహ్రూనగర్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ 2015లో బోయ మల్లికార్జున మృతి చెందినా 2017లో ఆయన పేరుమీద బిల్లులు చేసుకుని స్వాహా చేశారని తెలిపారు. వలసలు వెళ్తున్న కూలీలకు పనులు చూపాల్సింది పోయి ఎవరు మృతి చెందారో, బిల్లులు ఎంత దోచుకోవాలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదురు చూస్తున్నారని మండిపడ్డారు. ఐడి 2298 నంబర్‌పై వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించి 3 సంవత్సరాలవుతున్నా బిల్లు మాత్రం రూ.3 వేలు ఇచ్చారని, మిగతా డబ్బు ఇవ్వమని అడిగితే అప్పుడు, ఇప్పుడు అంటూ కాలం గడుపుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మృతి చెందిన వారిపై మస్టర్లను తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఇలాంటి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

ప్రజాశక్తి - వెలుగోడు

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రగతి అనాథ శరణాలయంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 25 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు సహాయాన్ని చేయడం అలవరచుకోవాలని సూచించారు. అనాథ శరణాలయం నిర్వాహకులు శేఖర్, అనాథ బాలురు పాల్గొన్నారు.

నేడు మల్లన్నకు వార్షిక ఆరుద్రోత్సవం

శ్రీశైలం : ప్రతి ఏడాది ధనుర్మాసంలో వచ్చే ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని నేడు సోమవారం రాత్రి మల్లికార్జున స్వామికి ఆరుద్రోత్సవం నిర్వహిస్తున్నట్లు ఇఒ భరత గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉత్సవాన్ని ప్రతి నెలలో మాసోత్సవంగా నిర్వ హిస్తారన్నారు. స్వామి వారికి మహాన్యాసపూర్వక లింగోద్భ వకాల రుద్రాభి షేకం, అన్నాభిషేకం, మరుసటి రోజు మంగళవారం తెల్లవారు జామున ప్రాతకాల పూజల అనంతరం ఉత్తరద్వార దర్శనం, నందివాహనసేవ, గ్రామోత్సవం జరిపిస్తా మన్నారు. ఈ ఉత్సవం నిర్విఘ్నంగా జరగాలని ముందుగా గణపతిపూజ నిర్వ హిస్తారని, అనంతరం 11 మంది వేద పండితులు మంత్రాలు పఠిస్తుండగా అభిషేకాన్ని నిర్వ హిస్తారని చెప్పారు. ఉత్సవంలో భాగంగా ఉత్సవ మూర్తులను ఆలయ ముఖమండప ఉత్తరద్వారం ద్వారా ప్రధాన వీధుల్లోకి నంది వాహనంపై ప్రవేశింపజేసి గ్రామోత్సాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

జూపాడుబంగ్లా : మండలంలోని తరిగోపుల గ్రామంలో ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు వాడాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా 33.1 శాతం మంది 15 నుంచి 24 సంవత్సరాలు వయస్సు కలిగిన యువకులే ఉన్నారని పేర్కొన్నారు. నూతన సంవత్సరం వేడుకలను ప్రజలందరూ సంతోషంగా, శాంతియుతంగా సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. సర్పంచి, పోలీసులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్

అధికారులు గైర్హాజరయితే ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఈ నెల 2వ తేది నుండి ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగనున్న జన్మభూమి కార్యక్రమాలకు అధికారులు గైర్హాజరయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని నోడల్ అధికారి సత్యరాజు తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సౌజన్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను దరఖాస్తు రూపంలో తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు సమస్యలను జన్మభూమిలోనే పరిష్కరించాలని సూచించారు. తహశీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపిడిఒ శశికళ, జడ్‌పిటిసి సభ్యుడు వెంకటరాముడు, మండల ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, డా.అరుణ, ఎంఇఒ జానకిరాముడు, హౌసింగ్ ఎఇ రమణతో పాటు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల విషయంపై రసాబాస : సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ విషయంలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని అధికారులను నిలదీశారు. నోడల్ అధికారి జోక్యం చేసుకుంటూ జన్మభూమి కార్యక్రమాల్లో మరుగుదొడ్ల విషయాలను ప్రజాప్రతినిధులు చర్చించాలని, అవినీతికి పాల్పడ్డ వారి వివరాలతో పాటు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని సూచన చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు మౌనం వహించడం కొసమెరుపు.

పగిడ్యాల : ఈ నెల 2వ తేది నుంచి జరిగే జన్మభూమి కార్యక్రమాన్ని అందరూ కలిసి విజయవంతం చేయాలని నోడల్ అధికారి వీరారెడ్డి అధికారులను కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేది నుంచి 11 వరకూ 5వ విడత జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 4న చెంబుశవయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అధికారులు ఉదయానే 6 గంటలకు గ్రామాలకు వెళ్లి ఎవరైనా చెంబుతో బహిర్భూమికి వెళ్తుంటే వారిని ఆపి ఆ చెంబు తీసుకుని శవయాత్ర చేసి భూమిలో పాతిపెడతారన్నారు. గ్రామ కమిటీ గ్రూపు లీడర్లుగా నెహ్రూనగర్ హౌసింగ్ ఎఇ పురుషోత్తం, పగిడ్యాల ఎపిఎం అయ్యమ్మ, కొత్తముచ్చుమర్రి ఎఒ శ్రీనివాసులు, సంకిరేణిపల్లె ఎంఇఒ సుబాన్, పాతముచ్చుమర్రి పిఆర్‌ఎఇ వెంకటేశ్వర్లు, గణపురం ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు వ్యవహరిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమిలో అందరూ పాల్గొనాలి : జన్మభూమి కార్యక్రమంలో అధికారులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు అందరూ పాల్గొనాలని ఎంపిపి పుల్యాల.దివ్య కోరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే విధంగా మనందరం కృషి చేయాలన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాల కోసం మధ్యదళారులను ఆశ్రయించవద్దన్నారు. ఎలాంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి లేదా మా దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. మాజీ జడ్‌పిటిసి పుల్యాల.నాగిరెడ్డి, సర్పంచులు శేషమ్మ, దాసు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పి.దివ్య

జూపాడుబంగ్లా : ఈ నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న జన్మభూమి-మన ఊరు కార్యక్రమాన్ని ప్రతిష్టంగా చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి వెంకట్రామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపిడిఒ సుబ్బారెడ్డి, తహశీల్దార్ జాకీర్ హుసేన్, టిడిపి మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మిడుతూరు : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి నిర్వహిస్తుందని తహశీల్దార్ భూలక్ష్మీ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుండి అర్జీల ద్వారా స్వీకరించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఇఒఆర్‌డి పుల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరిలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం, నగర పంచాయతీ పరిధిలో ఈ నెల 2వ తేది నుండి 11వ తేది వరకూ జన్మభూమి కార్యక్రమాలు రోజుకు రెండు బృందాలు నిర్వహించనున్నారు. నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో రోజుకు రెండు వార్డుల చొప్పున జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మండలంలో : 2న పిన్నాపురం, ఇందిరేశ్వరం, 3న కురుకుంద, వడ్లరామాపురం, 4న కృష్ణాపురం, శ్రీపతిరావుపేట, 5న సిద్ధాపురం, 6న సిద్ధేపల్లి, 7న అమలాపురం, 8న ముష్టేపల్లి, 9న నల్లకాల్వ, 10న బాపనంతాపురం, 11న కరివేన గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి సత్యరాజు తెలిపారు.



ఆత్మకూరు సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

కొత్తపల్లి : ఈ నెల 2వ తేది నుంచి మండలంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కమలాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2న ఎర్రమఠం, 3న ముసలిమడుగు, 4న పెద్దగుమ్మడాపురం, శివపురం, 5న గోకవరం, 6న ఎదురుపాడు, 7న నందికుంట, 8న దుద్యాల, 9న కొక్కెరంచ, 10న గువ్వలకుంట్ల, వీరాపురం 11న కొత్తపల్లి గ్రామాల్లో జన్మభూమి జరుగుతుందన్నారు.

నేడు మండల స్థాయి అధికారులకు సమావేశం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జన్మభూమి కార్యక్రమంపై నేడు మండలస్థాయి అధికారులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కమలాకర్ తెలిపారు. అన్ని శాఖలాధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నూతన సంవత్సరానికి

స్వాగతం పలుకుతున్న సమస్యలు

ప్రజాశక్తి-ఆదోని

డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో దళిత వాడల్లో మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికలు కూడా లేవు. వజ్రాలు దొరుకుతున్న ఈ ప్రాంతాల్లో కనీసం తాగేందుకు మంచినీరు కూడా దొరకడం లేదు. రహదారులు సక్రమంగా లేక పంటలను మార్కెట్‌యార్డుకు తరలించుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గ్రామాల్లో తాగేందుకు మంచినీరు లేక పొలాల్లో, బోరుబావుల్లో ఫ్లోరైడ్ నీటిని తాగాల్సిన దుస్థితి ఉంది.. నీటి సమస్య పరిష్కారానికై తమ శాయశక్తులా కృషి చేస్తామంటూ హామీలు చేస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం శూన్యం. పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్య తీర్చుతున్న తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని చివరి ఆయకట్టు భూములకు నీరందక ఎడారులుగా మారుతున్నాయి. ఆయకట్టు భూములకు నీరందించి రైతులను అన్నివిధాలా ఆదుకుంటామంటు చేసిన వాగ్ధానాలు నీటిమూటలుగానే మిగిలాయి. రైతులు పండించిన మిరప పంటలకు మార్కెట్ వసతి లేకపోవడంతో కర్నాటకలోని దూర ప్రాంతాలకు వెళ్లి తక్కువ ధరలకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుంది.. వ్యవసాయ కూలీలు, రైతులు, దళితులు, మైనార్టీలు, మున్సిపాలిటిలో పేదప్రజలు నివాసముంటున్న ప్రాంతాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, వీధిదీపాలు, రోడ్లు, డ్రెయినేజీ తదితర సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు వాగ్ధానాలు చేసి ఎన్నికైన అనంతరం మా ప్రాంతాల వైపు ప్రజాప్రతినిధులు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శలున్నాయి. పెరుగుతున్న ప్రజల అవసరాలకనుగుణంగా మంచినీటి సరఫరా లేకపోవడంతో నీటికోసం రేయి, పగలు కొళాయిల దగ్గర కాపలా కాయాల్సి వస్తుంది. శాశ్వత మంచినీటి పరిష్కారానికై బసాపురం ప్రాంతంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించినప్పటికీ కొన్ని ప్రాంతాలకు పైపులైన్ సౌకర్యం లేక పక్కనే ఉన్న పర్వతాపురం లాంటి కాలనీలకు నీరులేక లీకేజి నీటిని తాగాల్సిన దుస్థితి దాపురించింది. నీటి సమస్యను పరిష్కరించాలంటు అనేకసార్లు ప్రజలు మున్సిపల్ కార్యాలయాలను నిర్బంధించిన ప్రయోజనం శూన్యం. మహిళకు మరుగుదొడ్లు లేకపోవడంతో బహిర్భుమికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అధికశాతం 20 వేల కుటుంబాల మహిళలు అగరబత్తి వృత్తిపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కుటుంబసభ్యులంతా కష్టపడినా కడుపునిండ తిండి కూడా చాలడం లేదు. మధ్యదళారులు కంపెనీల నుంచి అధికరేట్లకు కాంట్రాక్టు తీసుకొని కూలీలకు తక్కువరేట్లకు ఇస్తూ దోచుకుంటున్నారు. గత 50 ఏళ్లుగా షేర్‌ఖాన్ కొట్టాల్లో గుడిసెలు వేసుకొని కాపురం ఉంటున్నారు. తమకు పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని సంవత్సరాల తరబడి నిరాహార దీక్షలు నిర్వహించిన, నిరసన తెలిపినా పాలకుల్లో చలనం లేదు. గుడిసెరహిత రాష్ట్రాన్ని ఏర్పాటు చేయగలమని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేయడంతో పేదలు ఉన్నగుడిసెలు తొలగించుకొని పక్కాఇళ్లు నిర్మించుకునేందుకు పథకాలను నమ్ముకొంటే సకాలంలో డబ్బులు రాక మధ్యలోనే నిర్మాణాలు ఆగిపోయి పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పావలా వడ్డీకే రుణాలందిస్తామంటూ మహిళా ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు పట్టించుకోకపోవడంతో రుణాలకై బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పైసా రుణం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారు. 90 ఏళ్లు పైబడి అనాదిగా జీవిస్తున్న వందలాది మంది వృద్ధులు, వికలాంగులు పెన్షన్ల కోసం పాలకుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నూతన సంవత్సరానికి ఈ సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.



ధనుర్మాస పూజలు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో శ్రీరామదేవరు, శ్రీకాశీవిశ్వనాథ, శ్రీఆంజనేయ స్వాములకు ఆలయంలో ఉదయం 4 నుంచి 6 వరకు ధనుర్మాస పూజలు నిర్వహించినట్లు అర్చకులు నరసింగాచారి, రాజీవ్ ఆచారి తెలిపారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణతోపాటు మహా మంగళ హారతులు తదితర పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందించారు. పూజలకు భక్తులు, మహిళలు పెద్దఎత్తున వస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-దేవనకొండ

మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి సమయంలో యువత కేరింతలతో కేక్‌లను కట్‌చేసి 2017కు వీడ్కోలు పలికి 2018కి స్వాగతం పలుకుతూ సంబరాలు జరుపుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పిడిఎస్‌యు దీక్షకు జనసేన మద్దతు

ఆదోనిరూరల్: పిడిఎస్‌యు ఆధ్వర్యంలో చేపట్టే నిరాహారదీక్షకు జనసేన పార్టీ సేవాదళ్ సభ్యులు నాయకులు అన్వర్ పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ రెండవ ముంబాయిగా పేరుగాంచిన ఆదోని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం దారుణమన్నారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదోనిలో మెరుగైన విద్య కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పట్టణంలో అధికార, ప్రతిపక్ష నాయకులున్నా ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా నాయకురాళ్లు రేఖ, పవన్, సతీష్, యోగేంద్ర, మధు, ఇష్కర్, మంజు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాపు బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కాపు బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కాపు బలిజ సంఘ పట్టణ అధ్యక్షుడు ఆదిశేషులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ నూతన ఏడాది క్యాలెండర్లను జిల్లా కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగంశెట్టి సోమశేఖర్‌కు ఆదోని క్యాలెండర్లను అందించినట్లు తెలిపారు. కర్నూలులో నూతన కాపు బలిజ కార్యాలయం చాలా చక్కగా ఉందని, దూర ప్రాంతం నుంచి వచ్చిన బలిజలకు వసతి ఏర్పాటు చేయాలని సింగంశెట్టి సోమశేఖర్‌ని కోరారు. ఆయన మాట్లాడుతూ కాపు బలిజలు ప్రభుత్వం అందిస్తున్న కార్పొరేషన్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎబికెబిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మామిళ్ల, జిల్లా కోశాధికారి పెద్దిగారి లక్ష్మన్న, నగర శాఖ ఉపాధ్యక్షుడు యు.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఇద్దం రామస్వామి, రఘు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో

డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త ఏడాదిలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యార్థుల మనుగడకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో పది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ శివరాములు, ఉపాధ్యాయులు నాగరాజు, నాగేంద్రప్ప, లోకనాయక్, రమేష్‌నాయుడు, మోహన్‌రావు, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్: ఆదోని ఉప విద్యాధికారి కార్యాలయంలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో 2018 ఏడాది క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ ఎపిటిఎఫ్ సంస్థ ప్రభుత్వ విద్యా రంగానికి పరిరక్షించేందుకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరంగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వం అనుసరించే విద్యారంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ప్రతి కార్యకర్త పోరాటాల్లో పాల్గొని సమస్యల పరిష్కారానికి భాగస్వాములు కావాలన్నారు. ఎపిటిఎఫ్ డైరీ పూర్తి సమాచారంతో కూడుకున్నదని, ఉపాధ్యాయులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

2 నుంచి జన్మభూమి మా ఊరు

ఆలూరురూరల్: 2 నుంచి 11 వరకు జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో గ్రామ, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని మండల నోడల్ అధికారి రాజశేఖర్ కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, సర్పంచులు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పక్కా ప్రణాళికతో పాల్గొని ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర పథకాలను అందుబాటులో ఉండి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా చేశారన్నది తెలియజేయాలన్నారు. గ్రామాలను ఒడిఎఫ్‌గా ప్రకటించేవరకు అధికారులు కృషి చేయాలన్నారు. రైతులకు సబ్సిడీ రుణాలు, పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ తదితర సమస్యలపై వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రజలు సమస్యలపై ఇచ్చిన వినతిపత్రాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక పాఠశాల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపోటీలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గానికి 2 వేల పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పెన్షన్లు రాని వారు తక్షణమే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ విజయ భాస్కర్, తహశీల్దార్ సూర్యనారాయణ ప్రసాద్, జడ్‌పిటిసి రాంభీంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్లబ్‌లో రగడ

ప్రజాశక్తి-ఆలూరురూరల్

ఆలూరులోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో మళ్లీ రగడ రాజుకుంది. గతంలో క్లబ్ కార్యదర్శి కోసం ఇరువర్గాల పోరులో రూ.50 వేలు లెక్క చూపించాలని ఆ మొత్తం వాడుకున్నట్లు ఇరు వర్గాల మధ్య చెలరేగిన గొడవతో, క్లబ్ రెన్యూవల్ చేయకపోవడంతో స్థానిక సిఐ దృష్టికి వెళ్లగా క్లబ్ రెన్యూవల్ చేసి కొత్త కమిటీని ఎన్నుకున్న తరువాతే క్లబ్ తెరవాలని ఆదేశించడంతో క్లబ్ మూతపడిన విషయం తెలిసిందే. క్లబ్‌లోని సీనియర్ సిటిజన్లు అతికష్టంపై క్లబ్ రెన్యూవల్ చేసి కమిటీని ఎన్నుకున్నారు. డిసెంబర్ 31లోగా క్లబ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గత పాలక వర్గాలు ఖర్చు పెట్టిన మొత్తాన్ని లెక్క చూపించాలని రోకప్ప, మహ్మద్ కోరారు. క్లబ్ ఇరువర్గాలతో గందరగోళం ఏర్పడింది. ఈ వర్గపోరులో రిటైర్ట్ ఉద్యోగస్తులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా క్లబ్‌లో రిటైర్ట్ ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు ఉండటంతో వర్గ రాజకీయాలు ఏర్పడి చిలికి చిలికి గొడవ ఎటు దారి తీస్తోందోనని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

ఆయకట్టుకు నీరందేనా?

ప్రజాశక్తి-ఆదోని

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన 750 క్యూసెక్కుల నీటికి గాను తక్కువ క్యూసెక్కుల నీరు రావడానికి కారణం కర్నాటకలో కనుచూపుమేరలో అక్రమ ఆయకట్టు, జలచౌర్యం జరుగుతున్న పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదు. రబీలో ఆయకట్టు భూములకు నీరందేనా అని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఆదోని డివిజన్‌లోని రైతులకు తుంగభద్ర కాలువ కల్పతరువుగా ఉంది. ఈ కాలువ ఆదోని, ఆలూరు తదితర నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో దాదాపు 1.07 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తోంది. సుమారు 195 గ్రామాల ప్రజలకు తాగునీరు అందిస్తూ వేలాది మంది రైతులను, వ్యవసాయ కూలీలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదుకుంటోంది. కర్నాటక రాష్ట్రంలో ఉండే కాలువ కింద దాదాపు 3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించగా ఇందులో లక్షా 60 వేలు కర్నూలు జిల్లాలో ఉంది. కర్నాటక రాష్ట్రంలో ఉండే కాలువ కింద ఉన్న ఆయకట్టు ప్రాంతానికి కాలువ 2,600 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా ఆంధ్రప్రదేశ్ వాటాగా 750 క్యూసెక్కుల నీరు కేటాయించారు. జిల్లాలోని 250 కిలోమీటర్ల నుంచి దిగువ కాలువ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండగా 157 కిలోమీటర్ల నుంచి 250 కిలోమీటర్ల వరకూ తుంగభద్ర బోర్డు నిర్వహణలో ఉంది. దిగువ కాలువ కింద రబీలో లక్షా 8 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినప్పటికీ కర్నాటకలో అక్రమ ఆయకట్టు పెరగడం వివిధ కారణాల వల్ల స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందడం లేదు. రబీలో 60 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ తుంగభద్ర దిగువ కాలువ కల్పతరువుగా భావించవచ్చు. ఇప్పటికైనా డివిజన్‌లోని ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్పందించి నీటివాటాను రప్పించి చివరాయకట్టు రైతులకు నీరందించి ఆదుకోగలరని ఆశిద్దాం.



అక్రమంగా నీరు తరలిస్తున్న దృశ్యం (ఫైలు ఫోటో)

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దకడుబూరు

పెద్దకడుబూరులో జనవరి ఫస్ట్ సందర్భంగా నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఎంపిపి రఘురాం, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ శివాంజల్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడల్లో కబడ్డీకి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. గ్రామీణ కబడ్డీ క్రీడాకారుల్లో ఎంతో ప్రతిభ ఉంటుందని, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విజేతకు ఎంపిపి రఘురాం రూ.10,116, రెండవ విజేతకు వైసిపి నాయకులు రామాంజినేయులు రూ.5,116 అందజేస్తారని తెలిపారు. ప్రతి క్రీడాకారుడు ప్రతిభను చాటి క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు.



పార్టీ జెండాను ఎగురవేస్తున్న మల్లయ్య

ఎఫ్ఎం బుక్ గల్లంతు : సిపిఎం

ప్రజాశక్తి-కౌతాళం

మండలంలోని రౌడూరు గ్రామంలో సర్వే నెం.1 నుంచి 100 వరకు సంబంధించిన ఎఫ్ఎం బుక్ గల్లంతు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి లింగన్న, సీనియర్ నాయకులు మల్లయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం రౌడూరు గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రికార్డులు గల్లంతు కావడంతో రైతుల భూములు, హద్దులు గుర్తించలేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల మధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందన్నారు. ఆలూరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాందాసు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ధరణిరెడ్డి

రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో శ్రీదస్తగిరయ్య ఉరుసు సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను మంత్రాలయం వైసిపి యువ నాయకులు వై.ధరణిరెడ్డి ప్రారంభించారు. ఎడ్ల పోటీల్లో న్యూ కేటగిరిలో గెలుపొందిన మొదటి జతకు రూ.30 వేలు, రెండవ జతకు రూ.20 వేలు, మూడవ జతకు రూ.15 వేలు అందిస్తారన్నారు. 2018లో జరిగే ఉరుసులో న్యూ జత ఎద్దుల కేటగిరికి రూ.60 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ అభిమానిగా రైతుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన మొదటి బహుమతి కింద కనకవీడు కింగ్స్‌కు రూ.5,016, రెండవ బహుమతి కింద దస్తగిరయ్య టీంకు రూ.3,016 అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివన్న, రాజు పాల్గొన్నారు.

ప్రజలకు హాని కల్గించే చట్టాలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

భూసేకరణ, పునరావాస ప్రక్రియల్లో పారదర్శకత, న్యాయమైన నష్టపరిహార హక్కు చట్టం 2013ను సవరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబర్ 29న అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టడం అన్యాయమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యుఎం దేవేంద్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు హేమంత్‌కుమార్; జిల్లా కార్యదర్శి కె.శివశంకర్, నాయకులు డి.దామోదర్ ఖండించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రజలకు అనుకూలంగా ఉన్న చట్టాలకు తూట్లు పొడుస్తూ అసెంబ్లీలో వారికి హాని కల్గించే చట్టాలను తీసుకురావడం సరైన నిర్ణయం కాదన్నారు. గతంలో ఎన్నో ప్రజా ఉద్యమాల ఫలితంగా నష్టపరిహార హక్కు చట్టం 2013 వచ్చిందని, పరిశ్రమల కోసం, ఇతర ప్రాజెక్టుల కోసం జీవనోపాధిని కోల్పోతున్న అభివృద్ధి నిర్వాసితులకు 2013 చట్టం భాగస్వామ్య కల్పించిందని, అలాంటి చట్టం కార్యరూపం దాల్చకముందే దాన్ని నీరుకార్చేందుకు పూనుకోవడం అమానుషమన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాజ్యాన్ని ఏర్పాటుచేసి అభివృద్ధి సాధించేందుకు వేగంగా భూమిని సేకరించేందుకు ఈ చట్టం ఆటంకంగా ఉందని చెబుతూ నిర్వాసిత ప్రజలకు రక్షణ కవచంగా ఉన్న కొన్ని కీలక అంశాలను ప్రభుత్వం సవరించాలని చూస్తోందన్నారు. విదేశాంగ శాఖ ఆవసాలు, గ్రామీణ ప్రాజెక్టులకేకాకుడా పారిశ్రామిక కారిడార్, ప్రయివేట్, పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ ప్రాజెక్టులకు కూడా సామాజిక ప్రభావం అంచనా నుంచి మినహాయించాలని పేర్కొనడం ఘోరమన్నారు. కోర్టుకు వెళ్లకుండా సమయాన్ని తక్కువగా నిర్ణయించడం, చట్టంలోని 3వ అధ్యయనంలో పేర్కొన్నట్లు ఆహార భద్రత కోసం పంటలు పండే భూములను సేకరించరాదని, వీటిని మినహాయించాలని, సంబంధిత భూ యజమానుల నుంచి సమ్మతి పత్రాలను తీసుకోవడం తదితర అంశాలుండటం నిర్వాసిత ప్రజల జీవించే హక్కు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇది కేవలం రాజధాని ప్రాంతంలో మోసపూరితంగా సాగుతున్న ల్యాండ్ పూలింగ్ అని, కోస్తా తీరంలో గుట్టుగా సాగుతున్న అన్యాయ భూసేకరణ చట్టంలో భాగమేనన్నారు. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేస్తోందన్నారు. దీనిపై పోరాటాలకు సిద్ధమవుతుందన్నారు.

5 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరు: శ్రీనీలకంఠేశ్వరస్వామి మహా రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, తాటికొండ హరిబాబు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ 5, 6, 7 తేదీల్లో బాలికల జూనియర్ కళాశాల మైదానంలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.30,116, రెండవ బహుమతి రూ.20,116, మూడవ బహుమతి రూ.15,115, నాలుగో బహుమతి రూ.10,116 ఇస్తున్నట్లు తెలిపారు. 300 కిలోమీటర్లు పైబడి వచ్చే క్రీడాకారులకు ఎంట్రీ ఫీజు ఉండదని, అందరు క్రీడాకారులకు భోజనంతోపాటు వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 7386915560, 9059991497 సంప్రదించాలని కోరారు.

దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దేవనకొండ: గ్రామాల్లో ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ సిఐ విక్రమసింహా, ఎస్ఐ గంగయ్య యాదవ్ సూచించారు. మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ఆదివారం దండోరా వేయించి గ్రామస్తులను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారమందించాలన్నారు. చిన్నచిన్న విషయాలపై ఘర్షణలకు పోకుండా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారి సమాచారాన్ని అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో అల్లర్లను ప్రోత్సహించే వారు ఎంతటివారైనా ఉపేక్షించమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవకు రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి-నందవరం



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు

నందవరం గ్రంథాలయ అధికారిగా పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు ఉత్తమ రాష్ట్ర గ్రంథాలయ అధికారిగా పురస్కారం అందుకున్నారు. డిసెంబర్ 29న అమరావతిలో రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు పార్వతి, ఛైర్మన్ సంధ్యారాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 54 మండలాల్లో తనకు రాష్ట్ర స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. గ్రంథాలయాలను ప్రజల చెంతకు చేర్చేందుకు ప్రతి గ్రామంలో మినీ గ్రంథాలయాల ఏర్పాటుకు జిల్లా గ్రంథాలయ శాఖ సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2011, 2017లో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నట్లు, రాబోయే రోజుల్లో పాఠశాలకు మరింత చేరువై మన్ననలు పొందేందుకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

పులికనుమ ప్రాజెక్టు నుంచి

కోసిగికి సాగు, తాగునీరందించాలి

ప్రజాశక్తి-కోసిగి



మాట్లాడుతున్న గుడిసె శివన్న

మండలానికి తూము ఏర్పాటు చేసి కోసిగి మండలానికి సాగు, తాగునీటిని అందించాలని మంత్రాలయం బిజెపి ఇన్చార్జి గుడిసె శివన్న, మండల నాయకులు మల్లారెడ్డి, విష్ణు, రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పులికనుమ ప్రాజెక్టుకు కోసిగి మండల రైతులు వందల ఎకరాల భూములిచ్చారన్నారు. భూములు కోల్పోయిన రైతులకు తూము ఏర్పాటు చేయకుండా కింది ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడం బాధాకరమన్నారు. మండలం నిరక్షరాస్యతతోపాటు కరువు కాటకాలతో అల్లాడుతున్నా పక్కనే ఉన్న ప్రాజెక్టు నుంచి నీరు అందకపోవడం విచారకరమన్నారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో చాలామంది గుంటూరు, బెంగళూరు, ముంబాయి తదితర గ్రామాలకు వలసలు వెళుతున్నా ఏ ఒక్క అధికారిగాని, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తూము ఏర్పాటు చేసి తాగు, సాగునీరందించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

ప్రజాశక్తి-విలేకరులు

కోసిగి: మండలంలోని అన్ని గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికే జన్మభూమి కార్యక్రమాన్ని 2 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వరలక్ష్మి, తహశీల్దార్ రజినీకాంత్‌రెడ్డి, ఈఒఆర్‌డి అయ్యన్న తెలిపారు. ఆదివారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2 నుంచి నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంతో ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. జన్మభూమిలో సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఎపిఎం రమేష్, ఎపిఒ మనోహర్, అగ్రికల్చర్ ఎఇ గోపాల్, సర్పంచి ముత్తురెడ్డి, జడ్‌పిటిసి మంగమ్మ, ఎంపిపి నాడిగేని భీమక్క, ఆయాగ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

దేవనకొండ: గ్రామ పంచాయతీల్లో నిర్వహించే జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఇన్చార్జి ఎంపిడిఒ మహబూబ్‌బాష కోరారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో



కోసిగిలో మాట్లాడుతున్న రజనీకాంత్‌రెడ్డి

గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్యమంత్రి సందేశాన్ని, సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. గ్రామాల్లో జన్మభూమి సందర్భంగా పండుగ వాతావరణం నెలకొనే విధంగా ఉండాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఐ హాజీమ లంగ్‌బాబా, వివిధ గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో 2 నుంచి 11 వరకు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బంగారమ్మ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 2న నదిచాగి, కుంబళనూరు, 3న కాత్రికి, లింగాలదిన్నె, బాపురం, 4న రౌడూరు, ఉప్పరహాళ్, 5న బదినేహాళ్, కుంటనహాళ్, 6న తోవి, ఎరిగేరి, 7న కామవరం, ఉరుకుంద, 8న చిర్తపల్లి, మల్లన్నహట్టి, చూడి, 9న హాల్వి, వల్లూరు, 10న గోతులదొడ్డి, గుడికంబాలి, 11న పొదలకుంట, సుళకేరి, కౌతాళం గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

ఆస్పరి: జన్మభూమి గ్రామసభలను విజయవంతం చేయాలని నోడల్ అధికారి చెంగల్‌రాయుడు కోరారు. ఆదివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సలీంబాష అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2 నుంచి 11 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభలు జరుగుతున్న విషయాన్ని విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లోని సమస్యలను గ్రామసభల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతకు మేము సైతం...

- చెత్తను ఊడ్చి పారేస్తాం
- స్వచ్ఛ కర్నూలు సాధనకు కృషి
- పోలీసు సిబ్బందితో కలిసి శుభ్రం చేసిన హిజ్రాలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కర్నూలును స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న అధికారులతో కలిసి తాము కూడా నగరంలోని చెత్తాచెదారాన్ని ఊడ్చి పారేస్తామని ట్రాన్స్‌జెండర్‌లు చీపుర్లు చేతపట్టారు. ఆదివారం జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జట్టి, నగరపాలక సంస్థ కమిషనర్ సిబి హరినాథరెడ్డి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఉన్నతాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, మున్సిపాలిటీ, ఆర్‌టిసి సిబ్బందితో పాటు ట్రాన్స్‌జెండర్స్ ఉత్సాహంగా పాల్గొని, ఆర్‌టిసి ప్రాంగణంలోని ముళ్లకంచెలను తొలగించి, చెత్తాచెదారాన్ని ఊడ్చి పారేశారు. ఎస్‌పి మాట్లాడుతూ మాతో పాటు ట్రాన్స్‌జెండర్స్ స్వచ్ఛభారత్-స్వచ్ఛకర్నూలు కార్యక్రమంలో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రహదారి భద్రత కార్యక్రమంలో బ్రాండ్ అంబాసిడర్‌లుగా నియమించి ట్రాన్స్‌జెండర్స్ సేవలను వినియోగించుకుంటామన్నారు. రాయలసీమలోనే కర్నూలు బస్టాండు చాలా పెద్దదని, ఎక్కువ మంది ప్రజలు కర్నూలుకు వచ్చి పోతూ ఉంటారని, అటువంటి బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బస్టాండ్ చుట్టు పక్కల కంపచెట్లు పెరిగి, మురుగు ఎక్కువగా పేరుకుపోయి వెలుతురు తగినంతగా లేకపోవడంతో ఆ ప్రాంతంలో నేరపూరిత కార్యక్రమాలైన అసాంఘిక కార్యకలాపాలు, దోపిడీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. దీనిని నివారించడానికే ఈ ప్రాంతాన్నంతా స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేయగలిగామన్నారు. శుభ్రం చేసిన ఈ ప్రాంతంలో పచ్చని మొక్కలు పెంచి ఉద్యానవనంగా మార్చి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కమిషనర్ సిబి హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నినాదం మేరకు మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజులో అత్యధిక ప్రమాణాలతో కూడిన ఏర్పాట్లు చేసి కర్నూలు ఆర్‌టిసి బస్టాండును ఐఎస్‌ఒ స్థాయికి తీసుకెళతామన్నారు. ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ నగరపాలక సంస్థ ద్వారా ఆర్‌టిసి బస్టాండుకు మూత్రశాలలు మంజూరయ్యాయని, ప్రజలు కూడా ఆర్‌టిసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు సహకరించాలన్నారు. కర్నూలును స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దడానికి తమవంతుగా చెత్తను ఊడ్చడానికి స్వచ్ఛందంగా తరలి వచ్చామన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్‌లు అజ్మతుల్లా, జగన్మోహనరావు, డిఎస్‌పిలు ఖాదర్‌బాష, వెంకటాద్రి, గంగయ్య, సిఐలు నాగరాజారావు, సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ రంగముని, బాలాజీ కేంటీన్ నిర్వాహకులు ముప్పా రాజశేఖర్, ఎస్‌ఐలు, షీటీమ్స్ ఇన్‌ఛార్జీలు ఎస్‌ఐ విజయలక్ష్మి, షీటీమ్స్ సిబ్బంది, పోలీసు, మున్సిపల్, ఆర్‌టిసి సిబ్బందితోపాటు ట్రాన్స్‌జెండర్స్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎస్‌పి, మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరు వాసికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

మండలంలోని ఏనుగుబాల గ్రామానికి చెందిన నాయకంటి రామాంజినేయులుకు సామాజిక కృషి విభాగంలో గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో ఎస్‌ఎ యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూ విభాగంలో సామాజిక కృషి విజ్ఞాన విభాగంలో గోల్డ్ మెడల్ అందుకున్నామని, ఈ మెడల్‌ను వైస్ ఛాన్సిలర్ కంట్రోల్ ఆఫ్ ద ఎగ్జామినేషన్ రాజగోపాల్, ప్రొఫెసర్ శ్రీరాములు చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, మిత్రులు రామాంజినేయులకు గోల్డ్‌మెడల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో రామాంజినేయులు ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమంలో పని చేశారు.


మెడల్ అందుకుంటున్న దృశ్యం

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ కెఇ ప్రభాకర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

వెల్దుర్తి మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో డైరీ, 2018 క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్ ఆవిష్కరించారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి డైరీని, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంక్షేమానికి యుటిఎఫ్ పాటు పడుతుందని, ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల సమస్యల పట్ల స్పందించే ఏకైక సంఘం యుటిఎఫ్ అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు తమవంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో వెల్దుర్తి యుటిఎఫ్ సీనియర్ నాయకులు, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎం.జయరాజు, యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి హేమంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఆర్థిక కార్యదర్శి డి.రాము, గౌరవాధ్యక్షులు బి.సర్వేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు మద్దిలేటి, చెన్నకేశవరావు, నాగేంద్రయ్య, కేశవులు, శ్రీనివాసులు, ప్రతాప్, వెంకటరాముడు, నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి జయప్రదం చేయండి

ఆళ్లగడ్డ: జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపిడిఒ రాముడు తెలిపారు. ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 10 రోజుల పాటు జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు, 11.30 గంటల నుంచి 2 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి చాంద్‌బాష, ఎంపిపి బండి చంద్రుడు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటేశ్వర నాయక్, ఇఒఆర్‌డి మధుసూదన్‌రెడ్డి, పశువైద్యాధికారి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కెఇ ప్రభాకర్‌కు శంకర్‌శర్మ శుభాకాంక్షలు

కర్నూలు సిటీ: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన కెఇ.ప్రభాకర్‌ను ఆదివారం డాక్టర్ శంకర్‌శర్మ పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వెనుకబడిన కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికే క్రీడా రంగంలో అభివృద్ధికి కృషి చేశారని, భవిష్యత్తులో వైద్య రంగం అభివృద్ధికి సహకరించాలని సూచించారు. పెద్దాస్పత్రి సమస్యల పరిష్కారానికి అత్యధిక నిధులు వచ్చేలా చూడాలని కోరారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్‌శర్మ

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వీడ్కోల వేడుకలు

కర్నూలు కలెక్టరేట్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం 2017లో వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ దంపతులతోపాటు జిల్లా ఎస్‌పి గోపినాథ్‌జెట్టి, జిల్లా జాయింట్ కలెక్టర్ వి.ప్రసన్నవెంకటేశ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ 2018 సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతేడాదిలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

అవుకు: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోవెలకుంట్ల జోనల్ గేమ్స్ ఛైర్మన్ నాగమణి అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో కోవెలకుంట్ల జోనల్ గేమ్స్ గత మూడ్రోజులుగా నిర్వహించారు. ఇందులో 7మండలాలు, 64 పాఠశాలలు, 1800ల మంది విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14 విభాగంలో బి.సుమంత్‌రెడ్డి 800ల మీటర్స్, 400ల మీటర్స్, లాంగ్‌జంప్‌లో గోల్డ్ మెడల్ సాధించారని, 200మీటర్లలో పి.శంకర్‌రెడ్డి నెహ్రూ స్కూల్, 100మీటర్లలో భార్గవ్‌రెడ్డి, హైజంప్‌లో సోమశేఖర్ అంకిరెడ్డిపల్లె జెడ్పిహెచ్ స్కూల్, షాట్‌పుట్‌లో సాసీద్, అండర్-17 విభాగంలో కోవెలకుంట్ల గవర్నమెంట్ స్కూల్ 1500ల మీటర్లలో వంశీ దొర్నిపాడు, 800ల మీటర్లలో మాబాష కొండుపల్లె, 400ల మీటర్లలో రవితేజ అంకిరెడ్డిపల్లె, 200ల మీటర్లలో వెంకటశివారెడ్డి గుండ్ల శింగవరం, 100 మీటర్లలో సునీల్ అవుకు, లాంగ్‌జంప్‌లో మధు అంకిరెడ్డిపల్లె, హై జంప్ ప్రవీన్ అంకిరెడ్డిపల్లె, షాట్‌పుట్ మహేష్ కొలిమిగుండ్ల, డిస్కస్ ఓబులేసు కొండుపల్లె, అండర్-14 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ గుండ్ల శింగవరం, బాస్కెట్‌బాల్‌లో ఆక్సిలియం విద్యానికేతన్ బనగానపల్లె, చెస్‌లో బోడెమ్మనూరు జెడ్పిహెచ్ఎస్, క్రికెట్ నందవరం జెడ్పిహెచ్ఎస్, ఫుట్‌బాల్ అవుకు బాయ్స్, హ్యాండ్‌బాల్‌లో అవుకు బాయ్స్ హైస్కూల్, హాకీలో నెహ్రూ స్కూల్ బనగానపల్లె, కబడ్డి నందవరం, ఖోఖో దొర్నిపాడు జెడ్పిహెచ్ఎస్, జపక్‌తక్ర జెడ్పిహెచ్ఎస్ కొండుపల్లె, సాఫ్ట్‌బాల్ నందవరం, త్రోబాల్ గవర్నమెంట్ స్కూల్ కోవెలకుంట్ల, వాలీబాల్ జెడ్పిహెచ్ఎస్ బనగానపల్లె, అండర్-17 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ కైప జెడ్పిహెచ్ఎస్, బాస్కెట్ బాల్ దొర్నిపాడు జెడ్పిహెచ్‌స్కూల్, చెస్‌లో ఎపి మోడల్ స్కూల్ అవుకు, క్రికెట్ జెడ్పిహెచ్ఎస్ నందవరం, ఫుట్‌బాల్ జెడ్పిహెచ్ఎస్ భాగ్యనగరం, హ్యాండ్‌బాల్ జెడ్పిహెచ్ఎస్ దొర్నిపాడు, హాకీ బాయ్స్ హై స్కూల్ అవుకు, ఖోఖో జెడ్పిహెచ్ఎస్ దొర్నిపాడు, జపక్‌తక్ర కొండుపల్లె జెడ్పిహెచ్ఎస్, సాఫ్ట్‌బాల్ దొర్నిపాడు జెడ్పిహెచ్ఎస్, త్రోబాల్ నెహ్రూ స్కూల్ బనగానపల్లె, వాలీబాల్ జెడ్పిహెచ్ఎస్ బనగానపల్లె మొదటి బహుమతి సాధించాయన్నారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, గెలుపొందిన విద్యార్థులకు మెమెంటో, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విశ్వనాథరెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కడప అధికారి నరసింహ, ఎంఇఒ శ్రీధర్‌రావు, ఎస్‌ఐ వెంకటరామిరెడ్డి, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినీలు